Register No. M. 2190. M. R. RY.

సం॥ చందా రు. 4. ½ సం॥ చందా రు. 2/8

శ్రీ

# సాధనపత్రిక

VOICE OF RAYALA SEEMA.

ప్రతి శనివారము వెలువడును

ఆ॥ వె॥ [illegible]

[illegible]

సంపుటము ౫ | అనంతపురం 10—1—1931 వ, తేది శనివారము | సంచిక 19

## మైసూరు గ్రామ సీమలు

ఇటీవల కొందరు మిత్రులతోగూడి నేను మైసూరు రాజ్యమునందలి కోలారుజిల్లా లోని చిక్కనాయకనహళ్లి తాలూకాలోని కొన్ని గ్రామములజూచి వచ్చితిని. మేళ్యాపురము గొటకలాపురము, గోరిబిదనూరు, పల్లి రాళ్ళపల్లె, వాటంతొత్తపల్లె, సజ్జనపల్లె మేముచూచిన పల్లెలలో ముఖ్యమైనవి. ఇవి బ్రిటిష్ రాజ్యములోనున్న అనంతపుర మండలమునకు సరిహద్దులో నున్నందుచేత ఈరాజ్యపు గ్రామములకును మైసూరు రాజ్యపు గ్రామములకును తారతమ్యము కడుసులభముగా కనుగొన వచ్చును. ఈపల్లెలకును ఆపల్లెలకును మధ్యను దూరము మైలు రెండుమైళ్ళను అడవము లేకున్నను వానికిని వీనికిని అర్థాత్తు సంబంధమే కనుబడదు. మన సరిహద్దుదాటి మైసూరు రాజ్యములో అడుగుబెట్టిన వెంటనే ఆదేదో క్రొత్త లోకమునకు పోయినట్లుండెను.

### పల్లె మార్గములు.

మన రాజ్యములలోని పల్లెలకు ఒండొకటికి సరియైన మార్గమే లేదు. పెద్దబాటల నుండి ఒకటి రెండు ఫర్లాంగులలో నున్న గ్రామములకు పోవుటకైనను ఆయుతిమార్గము సరిగానుండదు. ... ఇరుకైన వుల ... మార్గములో కాడు గాళ్ళు గుంతలు ... ముళ్లపొదలు ... కూర్చొని పోవుచున్నను ... ప్రాణభయము తప్పదు. ఇంకను త్రోవలో మురుగునీటి గుంతలుండును దానిలో దిగియే మనుష్యులు పశువులు నడచిపోవలెను. మైసూరు గ్రామము లట్లుగాదు. ఏపల్లె నుండి ఏపల్లెకు ఎటుపోయినను అందు చక్కని రాజమార్గములు గలవు. దినాక్ మొదలగు ఊర్ల గుల మోటారులు వేసికొని పోవిగూడి గ్రామమునకెల్ల సులభముగా పోగలరు. పెద్దమార్గము నుండి అన్నిపల్లెలకును భద్రమైన రోడ్లు నిర్మింపబడినవి.

### గ్రామ నామములు.

మన గ్రామముల పేర్లు క్రొత్తవారికి తెలిసికొను విధమే కనుబడదు. వారు పల్లెజనుల నడిగి తెలుసుకోవలెను. రాత్రియైనచో తీర పల్లెలోనికిపోయి ఎవరినైన నిదుర లేపి విచారించువరకు వూరిపేరు తెలియదు. మోటారులలోపోవు జనులు దగ్గరదారుల మనుష్యులు కనబడనప్పుడు అక్కడ మోటారు దిగవిడచి ఊరిలోనికిపోయి విచారించుకొని రావలెను. మైసూరు గ్రామములకన్నిటిలో ఊరిలోనికిపోవుదారికి ప్రారంభమునందే ఒక పెద్దరాతి పలకనునాటి దానిపై ఇంగ్లీషులోను కన్నడములోను గ్రామనామమును, జనసంఖ్యను తెలియపరచి యుందురు.

### గ్రామ ముఖము.

మనపల్లెలు చేరవలెనప్పుడే దుర్వాసన ప్రారంభమగును. అడవిలో వంటియు సుఖముగా వచ్చిన మనగాని పల్లెచేరు నప్పటికి ఎక్కడలేని రోతయు గనుబడును. మైసూరు రాజ్యములో గ్రామ ముఖముల యందు సంధిములు కట్టించి కేశవులు నిలిపి సింహద్వారమువలె చక్కగా నలంకరించి యుందురు. చుట్టును గల గజముల దూరము గరుసో ఎఱ్ఱమన్నో పరచియుందురు సింహద్వారమున కీవలను ఆవలను పొడుగున రాతి బెంచీలు వేసియుందురు. పథికులు గాని గ్రామజనులుగాని వానిమీద కూర్చొని విశ్రాంతి ననుభవించ వచ్చును.

### చ పా తీ.

మేము తిరిగినచోట నెక్కడగానీ, ఊరిలోనే కాదు చెరువులలో పొలములలో అడవిలో, వీడునేల

లలో ఎక్కడను చపాతీకళ్ళికనబడలేదు. మనపల్లెలలో చపాతీ వైభవము చెప్పనక్కరలేదుగదా! అది చాకలులు చెఱచి, దేవాలయముల కెగబ్రాకి, ఇంటిమిద్దెల మీద వ్యాపించి ఊరిబావి నావరించుకొని, మనుష్యుల పంచెలు చీరలకుగూడ తగుల్కొనుచున్నది. మైసూరు పల్లెలలో నిది మచ్చుకైన గానరాలేదు. పొలముల చుట్టు కంచెలకు వారు గబ్బాకులను ఒక ముండ్లతీగను అల్లించుచున్నారు. అది వింత వింత రంగుల పూలు పూచి చూచుటకు మనోజ్ఞముగ నుండును. పెండలు నతికి వేసినయెడల తీగ అదియంతకదియే ఎండిపోవును. లేదా ఆకులోని పళ్ళలో త్రొక్కి నత్తువను వేయవచ్చును.

## గ్రామములోని వీధులు సందులు.

మన గ్రామముల జూపవచ్చిన వానికి పద్మవ్యూహ మిట్లుండునని వేరుగ వర్ణింప నక్కరలేదు. ఒక్క సందైనను చక్కగ నుండదు. ఇరుపైపుల గృహస్థులు, పంచటయగులు వేసి కొట్టిడీలు కట్టించి కొట్టములు వేసి తమకు తోచినరీతి వీధులను శక్తివంచనలేక ఆక్రమించుకొని యుందురు. ఒకచోనున్న గృహముకే ఒకడు తూర్పు వాకిలి పెట్టినయెడల నొకడు దక్షిణపు వాకిలి పెట్టును మఱియొక్కడు ఈశాన్యము. ఈవిధముగా గ్రామములో యెన్నికత్యలుండునో ఇందులను అన్నిముఖములుగా ఒక్కొక్కటి కల్పించి అలిగి మారుమూగము పెట్టినరీతిగా కట్టబడియుండును. మైసూరు గ్రామములపద్ధతి వేరు. ముఖ్యవీధులు విశాలమై వంకర టింకరలు లేక చక్కగ నుండును దాని కిరుపైపుల వరుసగ వీధులుండును, అనంతపురము క్రొత్తపేటపద్ధతిని గ్రామములు కట్టబడినవి. కాని కొన్ని ప్రాచీన గ్రామములుగూడ నున్నవి. క్రమముగా అవికూడ నూతనపద్ధతినే కట్టబడుచున్నవి.

## ధూళి దుమ్ము.

మన గ్రామములు దుమ్ముచె నిండినవి. నడివీధి ఎరువుదిబ్బవలె నుండును. గ్రామముల నడుమబెట్టిన నే ఎఱువుదిబ్బలు మనకు దర్శన మొసంగును. ఆగ్రామములలో నిట్టిదృశ్యము లగపడవు. సందులుగూడ కూడ ఊడ్చబడి తగ్గుమిట్టలు లేక పట్టణములలోని రాజవీధులవలె నుండును.

## అశ్వత్థపుకట్టలు.

ప్రతిగ్రామమునను విశాలమగు అరుగులుకట్టి అశ్వత్థవృక్షములు వేపచెట్లు పెంచబడినవి. ఒక్కొక్క గ్రామములో ఇట్టి నీడగల అరుగులు ఐదారు ఇంక ఎక్కువగను గలవు.

## వనములు.

మన గ్రామములలో ఎదిగిన మొక్కలను నరికి వేయుటేగాని, చెట్లను పెంచుట ఎన్నడును కానము. వనప్రతిష్ఠ సప్తసంతానములలో ఒక్కటియని మనవారు గణించిరి. కాని సంతానము లేనప్పుడు దత్తపుత్రుని పెంచుకొని మనవారు స్వర్గమున కెక్కుచున్నారు. గాని ప్రజోపయోగకరమగు వనప్రతిష్ఠను పూనుకొనరు. మైసూరుసీమలో గవర్నమెంటువారే అప్పుడప్పుడు వనములు నాటించి పెంచుచున్నారు.

## సాలి చెట్లు

రోడ్లు కిరుపైపుల సాలిచెట్లు మనదేశములో నూ నున్నవి. వానిపై జిల్లాబోర్డు అధికారము కలదు. కాని జనులు కొమ్మలు కొట్టుకొనుట తెగినంత కాపు నారి లేదు. క్రొత్తవి పెంచుటకు కనబడదు. మార్గములో చెట్లు దట్టముగా లేక నీడ అపురూపముగా నున్నది. కాని మైసూరు గవర్నమెంటువారు సాలెచెట్లను పెంచుట కొకవిధాన మేర్పరచినారు. సమీపగ్రామముల వారు తమ సరిహద్దు యున్నంతవరకు రోడ్లలో నీసాలచెట్లు పెంచవలెను. ఆచెట్లవలని ఫలము ననుభవించుటకు వానికే హక్కుకలదు. ఎండిన కొమ్మలను వాడు కొట్టుకొని పోవచ్చును. చెట్టు పడినయెడల వాడే దానిని ఉపయోగించవచ్చును. కాని దానిబదులు ఇంకొక చెట్టు నాటి పెంచుట వానివిధి.

## చెఱువులు.

ఆగ్రామముల చెరువులు సరియైన బందోబస్తులో నున్నవి. ఇంకే ఏ ఇంజనీర్లుగాని వచ్చి రిపేరిచేయుటలేదు. గ్రామములో ఆచెరువుల క్రింద సాగగు ఎకరముల దామాషాతో చెరువుకట్టను భాగించి అదంతయు రాళ్ళు పరచుదురు. ఒక్కొక్క రైతును తన వంతుకు వచ్చిన భాగపు చెరువుకట్ట ప్రదేశమును కాపాడవలెను. చవిటి పెరుగనీరాదు. గడ్డి యప్పుడప్పుడు కోసి వేయవలెను. ఈవిధముగా రయితులు తమతమ పొలికివచ్చిన చెరువుకట్టను రక్షించెదరు. పెద్ద రిపేరిలు కావలసినప్పుడు గవర్నమెంటువారే స్వంతఖర్చుతో చేసెదరు.

## గూళి.

మైసూరు గవర్నమెంటువారు పశువులవృద్ధికి అనేకవిధముల పాటుపడుచున్నారు. పశువుల పగషులు ఆరోగ్యములో ఎన్నచోట్లనో జరుగుచున్నవి. అదిగాక ఏ గ్రామమువారుగాని లేక ఏ ఒక్క రైతుగాని ఆబోతును పెంచదలచిన ఆ జిల్లాబోర్డువారు 50 రూపాయలు విరాళముగా నిచ్చెదరు. వాడు దానిని సరియైన పద్ధతులలో నుంచుకొనవలెను. ఇందువలన గ్రామములలోనే మంచి ఎద్దులు ఆవులు ఉత్పత్తియగుచున్నవి.

## గస్తీ.

రాత్రిళ్ళు ప్రతి గ్రామములోను గస్తీతిరిగెదరు ఇది ఒక్క గ్రామతలారీమీదనే పడిన బాధ్యత గాదు. నిత్యము నాలుగిండ్లవారు తలఒక్క మనుష్యుని గస్తీకి పంపవలెను. ఒకానొకరి వంతువలె నిది మాసమున కో రెండు మాసములకో ఒక్క పర్యాయము వచ్చును. నేను గస్తి తిరిగినవారు చోట్లకొట్టైలను ప్రక్క యింటిలో ఉదయమునకే వేతురు. నాటి రాత్రి తాము తిరుగవలసిన వంతని వారికి ఉదయమే ఆకట్టెలు చూచినప్పుడు తెలియగలదు. ఈవిధముగ వంతును మార్చుకొని రాత్రి పారాతిరుగుదురు. ఆ గ్రామముల పంచాయతీలను గుఱించి ముందు వారము తెలియబరచు కొందును.

వల్లు రా॥

# విజ్ఞాన తరంగిణి

1

మోక్షద్వారే ద్వారపాలాః చత్వారః పరికీర్తితాః ।
శమోవిచారః సంతోషః చతుర్థః సాధుసంగమః ॥
'యోగవాసిష్ఠం'

“24 గంటల కాలము మాత్రము, నీవున్నయెట్లు కోటీశ్వరుడ వయితివేని, నీ యంతకు నీవుమాత్రమే యనుభవించ గోరు సంతోషములలో నెక్కుడయినదేది?”

ఈ సమస్య ఐరోపా ఖండమునందలి డెన్మార్కు దేశపు ప్రధాన పట్టణమగు కోపెన్‌హేగన్ నగరమందలి 'పొలిటికెన్' అను పత్రిక ప్రకటించినది. ఈ ప్రశ్నకు చదువరులు వ్రాసిపంపు జవాబులలో నుత్తమోత్తమ మయినదానికి పారితోషిక మొసగునదిగ పత్రికా సంపాదకుడు ప్రాట (జామీను). ఆ జవాబులోని కోరికను నెరవేర్చుటయే యా పారితోషికము

ఇక చెప్పవలెనా? దేశములోని చదువరులు కుప్పలు కుప్పలుగ ప్రత్యుత్తరముల నంప నారంభించిరి. వారు కోరు సంతోషము 24 గంటలలో ననుభవించి ముగించవలయుట మొదటి సమయము. ఆ సంతోషమయినను తాను మాత్రమే యనుభవించునట్టిదై యుండవలెనుట రెండవది. దానిని బంధుమిత్రవర్గమునకు పారించుట కాదు. పేదసాదలకు వడ్డించునదై యుండకూడదు. పెద్ద బంగళాలు, మోటరుకారులు పైవర్తులకు లోబడని కోరికెలు. నీవు కోరుసంతోషమును పొసగించుటకు అమితమయిన ద్రవ్యము వెచ్చముకానచ్చును పరవాలేదు. అయితే ఆ సంతోషము ఇరువది నాల్గు గంటల కాలములో ననుభవించి యారితీరవలెను.

వేల కొలది జవాబులు సంపాదకుని కార్యాలయము చేరినవి. మృష్టాన్నభోజనము కావలెననువారు, మోటారుకార్ స్వారి కావలెనువారే ఎక్కువమందియై తేలిరి. ఇరువదినాల్గు గంటలలో ననుభవించదగిన కోరికె మరి యేముండును?

మిస్ మ్యాజ్ కెన్ బారింగ్ అను తరుణి జవాబు వ్రాసిపంపిన వారిలో నొకా నొకర్తు. కోపెన్‌హేగన్ నగరపు కళాశాలయందలి విద్యార్థిని. సంపాదకు డామె ప్రత్యుత్తరమును తిలకించెను. కంటబడినది

మిక్కిలి చిన్న వాక్యము అది 'నేమున ఐన్‌స్టీన్ పండితునితో సంభాషించు భాగ్యము'. ఈ చిన్న మాటల వాక్యమందలి దాగియున్న విశాలభావము సంపాదకుని మనమున నొక్కడాటున నాకర్షించెను. ప్రత్యుత్తరములలో నదియే యుత్తమోత్తమ మని యాక్షణమే తీర్మానించిన వాడాయె.

ఐన్‌స్టీన్ పండితుడు లోకమందు పేరెన్నికగన్న పదార్థ విజ్ఞానయోగి. జర్మని దేశపు రాజధాని బర్లిన్ ఈమహామహుని వాసస్థానము. ప్రపంచమందెల్లను ప్రఖ్యాతి నొందిన మహాకవులు దూరదర్శనాలనదగు వారిని గుర్తుకొని మరల మరల జల్లెడ బట్టి చూచినట్లయిన మొత్తము కొలవంటి వారయిన గురు మాత్రమే తేలుదు రనుకొందము. ఐన్‌స్టీన్ పండితుడు అట్టి అయిదుగురిలో నొకడగుట తప్పదు. ఇట్టివాని సమాగమ సంభాషణములతో తులదూగదగిన భాగ్యఫలము మరియొద్ది? ఈ సమత్సరమునందలి రసజ్ఞతయొక్క లోతు, ఎత్తు, విరివి యను మానము లనుట యేమియాశ్చర్యము?

ఇక సంపాదకుడు దాని గ్రాసుదలిక ప్రాసగించుట మహాభాగ్యమని తలచినవాడాయె.

కోపెన్‌హేగన్ రైల్వేస్టేషన్ నుండి బర్లిన్ నగరమునకు ప్రయాణమగు రైలు బండ్ల పరుసయందు మొదటితరగతి దానిని రిజర్వ్ చేసిరి. దానినెక్కి యా పత్రికాశీలి, బర్లిన్ నగర రాజపు పొగబండినెలవు డిగిన వెంటనే, మిక్కిలి వైభవ సమగ్రమును విశాలమునయినట్టి మోటర్ కారు సిద్ధమై నిల్చియుండినది. దానినెక్కి యాపండితవర్యు నివాసముచేరి మధ్యాహ్న భోజనమున కభ్యాగతమై విడిసెను. విందుకు పిమ్మట నుభయులు ఆ దేకారు నారోహించి యానగరరాజమందలి దృశ్యముల చూడవలెననుట పారితోషిక భాగమై ముందే సంకల్పింపబడియుండినది.

ఒక బల్లకిరువైపుల నుభయులు పవసించి భోజనము నారంభించిరిగాని, వారిసంభాషణ భోజనమును సాగించదాయె. వివిధ విషయములగూర్చి ముచ్చటించిరి. 'ప్రపంచమున దేశదేశములకు సంగ్రామకారణముల నడుగంటజేసి శాంతి పొసగించుట యెట్లు' అనువిషయము నా యుభయుల తలంపుల సంపూర్ణముగ నాక్రమించుకొని పోయెను.

ఇంతలో నూరు తిరిగి చూడవలెనని లేచునంతకు, కోపన్‌హేగన్ నగరమునకు

బర్లిన్ రాజధానినుండి రైల్ బండి మరలి బయలుదేరు కాలము సమీపించినది. ఆబండి తప్పెనో, 24 గంటలలోపల వాయుభినవ సరస్వతి తనయూరు చేరుట కారానిపని ఆ గొప్ప మనసు సమముభంగమున కోర్చునా?

ఆ విద్యావంతుని నివాసమును వదలి యాసుదతీమణి బయటికి వచ్చుట చూడనలెననియే రసజ్ఞుల నేతులు వేచియుండిరి. ఆమె ముఖమున నుదయించియున్న వర్చస్సు ఏ ధనికుని ముఖమున నయినను తామదివరకు చూచియుండలేదని ప్రేక్షకుల యనువాదమై వినబడెను.

టి. శివశంకరం.

# అనంతపురం మ్యునిసిపాలిటి.

## ఇంటిపన్ను.

నూటికి $7\frac{1}{2}$ వంతున యీసంఘము వారు ఇంటిపన్నను హెచ్చుచేసి యుండిరి. ఇది సక్రమముకాదని ప్రకటన సరిగా లేదని మ॥ రా॥ శ్రీ శాంల్గీ వాసుదేవరావు మొదలగువారు సివిల్ వ్యాజ్యము తెచ్చియుండిరి. అది యింకను హైకోర్టు అపీళ్ళలో నున్నది. నిన్న కూడిన మ్యునిసిపల్ సంఘమువారు $7\frac{1}{2}$ పర్సెన్నుండవలెనని తీర్మానించినట్లు తెలియుచున్నది. ఇదివరకు $6\frac{1}{4}$ ఉండినదానిని $7\frac{1}{2}$ చేయుటకు కారణములు కనబడవు ఈ మ్యునిసిపాలిటీ గవర్నమెంటునకు ఏ విధముగా కూడ బాకీలేదు ఊరు జనవృద్ధి అగుచున్నది కావున మ్యునిసిపల్ వరమానము కూడ హెచ్చగు చుండును. పన్నేల హెచ్చింప వలెను?

## నీటిపన్ను.

రెండేండ్ల క్రిందట దీనిని $6\frac{1}{4}$ కు హెచ్చుచేసిరి. కాని కోర్టులో ఈ పన్ను సక్రమముగా విధింప బడలేదని తీర్మానించిన పనుక దీనిని కౌన్సిలువారు వెనుకటి రేటు అనగా 4 నకు దించిరి. కాని ఇందువలన ఏడాదికి రూ 400 తక్కువ పడినదని నిన్నటి మీటింగులో దానిని $4\frac{1}{4}$ కు హెచ్చించిరట. నీటి ఇంజన్ సిబ్బంది వగైరాలలో అనవసర వ్యయమును తగ్గించియుండిన ఆలోటు సరిపోయి పన్ను హెచ్చింప వలసిన అక్కరలేక పోయి యుండును. ఒక్క ఉదాహరణము. మ్యునిసిపల్ ఏరియాలో ఎండిన చెట్లు వేలము వేయబడు చున్నవి. కాని ఏ కారణమునో అవిచాల తక్కువ ఖరీదుకు సవాలైనట్లు లెక్కలు చూపుచున్నవి. నీటి ఇంజనునకు మ్యునిసిపాలిటీవారు బొగ్గులు కొనవలెను. వాని ఖరీదు చాలదుబారాగా నున్నది. ఈ ఎండిన మానులను ఇంజన్‌నునకు వేసే యేర్పాటు చేసినయెడల కొంత ఖర్చు తగ్గును గదా.

## స్కావెంజింగుపన్ను.

అనగా మరుగుదొడ్లు ఊడ్చుటకు పన్ను. ఇదివరకు ఈపన్నును జన సామాన్యము అచ్చుచుండలేదు. పాయఖానా లున్నవారు మాత్రము స్కావెంజింగు రుసుము చెల్లించుచుండిరి. ఇప్పుడు దొడ్లు ఉన్నవారు లేనివారునుగూడ చెల్లించునట్లు కౌన్సిలు తీర్మానించిరి. అందరును సమముగా 2% చెల్లింపవలెను. ఇందువలన భాగ్యవంతులకు రుసుము తగ్గినది. పేదలకు అనవసరముగా హెచ్చినది. రెండు రూపాయలుకూడ హెచ్చనియే చెప్పవలెను. ఈపన్ను ఉండితీర వలసినయెడల $1\frac{1}{2}$ చాలును. ఇప్పుడు జనసామాన్యమునకై నిర్మించిన మ్యునిసిపల్ దొడ్లు సరియైనస్థితిలో లేవు. మంచి కట్టడములు కావలెను. వానిని పరిశుభ్రముగా నుంచవలెను.

## డ్రైనేజి పన్ను.

మురికినీటి కాలువలు నిర్మించుటకు ఇదియొక్క పన్ను కొత్తగా విధింపబడినది. కొళాయిల నీటి దుర్గంధము రోత చెప్పనలవి గాకున్నది. రాజవీధులలో నక్కడక్కడ గారకాలువలు నిర్మించి అధికారోద్యోగులను తృప్తిపరచు పని మాత్రము జరిగినది. కాని జనులు క్రిక్కిరిసి యున్న సందులలో కొళాయినీటి మడుగుల నడుగువారు లేరు. సందులలో పుట్టిన రోగములు బజారున కెగబ్రాకక మానవు. మొగము మాత్రము శుభ్రముగా నుంచుకొన్న దేహమున కారోగ్యము రాదు. కాని బజారులో చేసిన వసతులే తక్కినచోట్లను చేసినయెడల క్రొత్త పన్నులు లేకనే మురికి కాలువల సమస్య పరిష్కరింపబడి యుండెడిది. ఈవిధముగా ఒక్కదానికొకటి పన్నులు హెచ్చించుచు పోయినయెడల బీదలుఊరు విడచి పోవలసి వచ్చును.

ఈపన్నులకు ఆక్షేపణ చేసికోదలచువారు ఈ నెలలోపుగ ఆక్షేపణలు పంపవలెను. ప్రజలకు తెలియకనే కౌన్సిలువారు పన్ను వేయుటయు దానిని ఆక్షేపణ వాయిదామీ

# ప్రవాహ బంధనము.

## హిందూపురము తాలూకాలోని కొన్ని చెఱువుల ఘోష
## మైసూరుసంస్థానపు రైతులచర్య—ప్రభుత్వమువారి కర్తవ్యము
## శాసనసభ్యులకు హెచ్చరిక.

మడకశిర హిందూపురము తాలూకాలలో నీటి కఱవు సంభవించుటకు కారణము లిదివఱకే ఎన్నిమారులో ఈపత్రికముఖమున చర్చింపబడినవి. మైసూరు రాజ్యము మన జిల్లాకు దక్షిణమున పీటభూమిగా నున్నది. మన జిల్లాలో పారు నదులన్నియు మైసూరురాజ్యమున పుట్టివచ్చునవే. పెన్న, చిత్రావతి, పాపఘ్ని, జయమంగళి, స్వర్ణముఖి మొదలు నదులన్నియు మైసూరు పీఠభూమినుండి దిగువకు మన జిల్లాలలోనికి పారి వచ్చునవే. ఇటీవల మైసూరువారు ఆనదుల కడ్డముగ కట్టలుగట్టి తమ రాజ్యపు చెరువులకు నీరు ప్రవహింపజేసుకొని మన జిల్లాలలోనికి నీరురాకుండ చేసిన విషయము పాఠకులు పలుమారు వినియున్నారు. ఇప్పుడు లేపాక్షిలో గ్రామపునర్నిర్మాణకార్యమున నిమగ్నులైయున్న మ॥ రా॥ శ్రీ వార్తకవి రామచంద్రరావు బి.ఏ., బి.యల్., గారును మరికొందరు మిత్రులతోగూడి నేనును కొంతవరకు ఈవిషయమును పరీక్షించితిమి. మరికొందరు మిత్రులవలనగూడ కొన్నివిషయములు తెలియవచ్చినవి. కాని ఇంకను ఈవిషయమై ఎంతయో పరిశోధన జరుగవలసియున్నది. ఆయా ప్రాంతజనులు తమ చెఱువులు ఎండిపోవుటకు కారణమేమో పెద్దలేమిచెప్పెదరో, ఆస్థలచారిత్రముగూడ కొంత తెలిసికొని పత్రికలకు వ్రాసిపంపుట మంచిది.

### లేపాక్షి.

లేపాక్షికి రెండు చెరువులున్నవి. పూర్వము వాడిగా ఇక్కడ చెరుకు పండు స్థలము. సారవంతములగు భూములు. ఎడతెగని నీటివసతి యున్నందున అరటితోటలతోను, ఫలవృక్షములతోను ఈ గ్రామము ఉద్యానవనమువలె నుండి జనులు ఐశ్వర్యవంతులైయుండినారు. కావుననే పూర్వము అక్కడ అంతగొప్ప దేవాలయమును కట్టుటకు విజయనగర రాజులు సంకల్పించిరి. 1840 సంవత్సరము అప్రాంతముల బళ్ళారి మండలములలో త్యాగరాజా మొదలి అనువారు ఇంజనీరుగా నుండిరట. వారు సరసకవితాధురీణులని నేనెరుగుదును. ఆంధ్రమున చాల లలితమగు కవిత్వము వారిది. శ్రీ యక్షిణీ యను సారస్వతపత్రికను వారు ప్రచురించుచుండిరి. శ్రీ యక్షిణియే ఆంధ్రదేశమున పుట్టిన పత్రికలలో మొదటిది. కాని త్యాగరాజాగారు ఇంజనీరుగా నుండిరనుట నాకీటీవల తెలిసినది. అప్పుడు అనంతపురం జిల్లాలకు చేరియున్నందున త్యాగరాజాగారు లేపాక్షివైపు సర్క్యూట్ వెళ్ళిరి. అప్పుడు లేపాక్షిలో మంచిపండితులు కవులు నుండిరి. అప్పటి వారెవ్వరో రచించిన లేపాక్షి రామాయణము నేటికిని ప్రచారములోనున్నది. త్యాగరాజాగారు లేపాక్షిలో మొకాము చేసి అప్పుడు కరణముగా నుండినవారు కవులనిగూడ విని తమవద్దకు పిలిపించుకొనిరి. కాని సంస్కృతాంధ్ర ఆంగిలేయ భాషాపాండిత్యము కలిగి రసికవృద్ధులైన త్యాగరాజాగారికి యా కరణముగారి కవిత్వము సరిపడలేదు. త్యాగరాజాగారు యోగ్యతాధికారములకు తగినంత గర్వముగూడ కలవారు. కావున ఆ కరణముగారి కవిత్వమును సంతోషింపక నిరసించి మాటాడిరి. కరణము మాత్రము సామాన్యుడా? 'నీ శాపుకవిత్వపుసన బాపనవిపరుని చెవికి ప్రమద బినునే' అనిదూషించినాడు. పరే త్యాగరాజాగారికి కోపము వచ్చినది. వెంటనే లేపాక్షినుండి మకాము మార్చి ఆమూరిచెరువునకు జలాధారమైన యేటికి ఎగువన ఇంకొక చెరువును నిర్మించినాడు. ఆకాలములో ఇంజనీరు మాట కాదనువాడెవ్వడు? ఎగువ చెఱువు నిర్మాణమైనది లేపాక్షిచెఱువు ఎండిపోయినది. దానికితోడు ఇటీవల వర్షము తగ్గినందున లేపాక్షి ద్వాదశవర్షక్షామమును అనుభవించుచున్నది. బావులలో నిన్నమొన్నటివరకు పాదప్రక్షాళనమునకు నీరు దొరకుచుండలేదు.

### శిరివరము—మానేపల్లి.

ఈరెండు గ్రామములకును ఒకే చెఱువు కలదు. దానిక్రింద సుమారు వేయి ఎకరముల తరి ఆయకట్టున్నది. భూమి మిక్కిలి సారమైనది; చెఱుకు పండునది. ఈచెఱువునకు రెండు జలాధారము లుండినవి. సంవత్సరము పొడుగునను చెఱువులో నీరుండి ముక్కాలు పండుచుండినందుననే ఆగ్రామములకు శిరివరమనియు మానాయకపురమనియు ఒక్కటి లక్ష్మీపేరటను ఇంకొక్కటి నారాయణపురి పేరటను నామధేయము లొసగబడెను. అవే ఇప్పుడు సిరివరము మానేపల్లి అనబడుచున్నవి. ఒక్కయేరు మైసూరు ఇలాఖా గుడిబండవైపునుండి వాటం కొత్తపల్లె మార్గముగా వచ్చుచుండినది. కాని మైసూరు రాజ్యమువారు కొత్తపల్లెకు ఎగువన రెండుకొండలకు మధ్యన కట్టగట్టివేసిరి. 300 గజములకంటె ఈకట్ట పొడుగులేదు. కాని ఇంచుమించు 50 అడుగుల ఎత్తున్నది. చెఱువు నిండినప్పుడు 36 అడుగుల లోతునీరుండును. క్రిందటి నెలలో మేము చూచినప్పుడు 28 అడుగుల లోతునీరుండినది. గోరిబిదనూరు నుండి గుడిబండకు పోవుగొడ్డు ఈ చెఱువు ప్రక్కగనే వెళ్ళును. ఈచెఱువునీరు 5,6 గ్రామములు సాగుచేయును. చెఱుకు తోటలు విశేషముగానున్నవి. ఈప్రదేశము లేపాక్షి మానేపల్లి గ్రామములకు 5 మైళ్ల పొడవునానే ఉన్నది. కాని ఇక్కడ దరిద్రము; మైసూరి సీమలో అడుగుపెట్టిన వెంటనే ఐశ్వర్యము కన్నులకగపడుచున్నది. ఆచెఱువు మరవపారినప్పుడు కొంతనీరు క్రిందకు వచ్చి చెరువు చేరును.

### ప్రతాప బుక్కరాయనుండ కాల్వ.

శిరివరము చెఱువు నించుటకే బుక్కరాయల కాలములో అనగా 14 వ శతాబ్దములో పినాకినీనుండి కాలువ తేబడినది. ఇది విజయనగర చక్రవర్తుల వసంతవిలాసమునకు పెనుగొండను నీటిసప్లయి చేయుటకు చేసిన ప్రయత్నము. సిరివరము నుండి పెనుగొండకు ఈ కాలువ వెళ్ళిన మార్గము మేము చూడలేదు. కాని వార్తకవి రామచంద్రరావుగారు సిరివరము నుండి ఈ కాలువను గుర్తించుచు ప్రయాణమొనర్చి దాని ఆద్యంతములు కనుగొనిరి. మైసూరి ఇలాఖా గోర్లాపురమునకు ఒక మైలుదూరమున చేనిలో ఈకాలువను సంబంధించిన శాసనమున్నది. శాసనపురీల పమపుగా క్రిందబడియున్నది. దాని వివరము లిదివఱకే రామచంద్రరావుగారు సభలయందు వెల్లడిపరచినారు. గోరిబిదనూరు నుండి చిన్నబళ్ళాపురమునకు వెళ్ళు మార్గములో పురము అను గ్రామమువద్ద పెన్నేటికి కట్టకట్టి నీరు కాలువకు త్రిప్పబడినది. నాటి (ఇంజనీరు) జలసూత్రవిశారదుడగు సింగాయభట్టు మిట్టపల్లములు తప్పించి ఆ కాలువవలన పాము మెలికలవలె తెచ్చి శిరివరము చెఱువు నింపినాడు. కడప కర్నూలు కృష్ణాకాలువ పెద్దదున్నది. ఆ కాలువకు ఈవలావల గట్లు 10, 12, అడుగుల ఎత్తున్నవి. కొన్నిచోట్ల ఈ గట్లు శిథిలమై నేలపాలైనవి. కాని కాలువ మార్గము స్పష్టముగా కానవచ్చుచున్నది. సింగాయభట్టు ప్రతిభ అసమానము. నేడా కాలువ నిరుపయోగమైనట్లు మాత్రమేగాక, దానిప్రక్కన పాడుపడిన గ్రామములను నిర్జనము చేసినది. కొన్నిలక్షలు ఖర్చుపెట్టిన యెడల ఈ కాలువ మరల జీవించునని అనుటకు సందేహము లేదు. కాని మన గవర్నమెంటువారికి బుద్ధి పుట్టవద్దా?

### పరిగి.

చోళులు, నోలంబపల్లవులు రాజ్యముచేసిన కాలములో అనగా ఇంచుమించు వేయిసంవత్సరముల

[9 వ పేజీ చూడుము]

---

రిన వెనుక ప్రజలు తెలిసికొనుటయు, మేము గెజటులో ప్రకటించినామని మ్యునిసిపాలిటీవారు తప్పించుకొనుటయు తుదకు ప్రజలకు పన్నుతప్పక పోవుటయు సంభవించుచున్నది. పై విషయములు నిజమాకాదా యని ప్రజలు విచారించి తెలిసికొని ఆక్షేపణ చేయునెడల వెంటనే మహాజరు అర్జీలు పంపవలెను. మాకు తెలిసినంత వఱకు పై విషయములు యధార్థములని నమ్మి ప్రజలను హెచ్చరించు చున్నాము.

శ్రీ

'సాధన' పత్రిక

1931 సం॥ జనవరి నెల 10వ తేది

శనివారము

## కో॥ సంఘ లోపములు.

లేపాక్షి యూనియన్ కోఆపరేటివ్ సంఘములు కొన్నింటిలోగల లోపములు సూచింపబడినవి. ఆ విషయమును పాఠకులు ఈపత్రికలో స్థలాంతరమున చదువగలరు. ఒక్క లేపాక్షి యూనియనులోనేకాదు ఇతర చోట్లగూడ సంఘములలో నిట్టిలోపములు కనబడుచున్నవి. వీనిని సవరించుమార్గములను మాకు తోచినవానిని సంగ్రహముగ నివేదింతుము.

సంఘ సభ్యులకు తమ బాధ్యత తెలియదు. ఇదివరకు ఎవరును చెప్పినవారుకారు. పూర్వమున సొసైటీలు స్థాపించినవారు, తామిన్ని సంఘములు స్థాపించితిమిగదా యనుపేరు సంపాదించ ప్రయత్నించిరి గాని, సహకారోద్యమముయొక్క కీడు మేళ్ళు వివరించి మెంబరులకు తమ హక్కులను బాధ్యతలను నిరూపించి చెప్పలేదు. సభ్యులకు తమ బాధ్యత తెలిసిన యెడల పంచాయితీ వారికే సమస్తము ఒప్పజెప్పి తాము నిద్రపోరు. సొసైటీలు పుట్టినప్పటినుండియు, కొన్ని చోట్ల 15, 20 సంవత్సరములుగా ఒకే పంచాయితీదార్లు లేదా ఒకే కార్యదర్శి అధ్యక్షుడు ఉద్యోగము చేయుచున్నారు. అప్పుడప్పుడు మార్పుండినగాని సంఘలోపములు బయటికిరావు. మూడేండ్లు దాటినవెనుక, ఒక సంవత్సరమువరకునైన ఆ పంచాయితీదార్లే మరల ఎన్నుకోబడకూడదను నియమము ఏర్పడవలెను.

పంచాయతీదారులు తాము అప్పుగా కొనునట్టియు జామీనుపడునట్టియు మొత్తము సొసైటీ వ్యాపారధనములో నాల్గవవంతుకు మించరాదను నిబంధన చేయవలెను.

పంచాయతీదార్లు జామీనుపడునట్టియు స్వయముగా తీసుకొనునట్టియు అప్పులు జనరల్ బాడీ తీర్మానమైన వెనుక పైఅధికారి ఎవరైనను పరిశీలించి ఆస్తిజామీను చాలియున్నదనీ ఇతర లోపములు లేవనీ సిఫారసుచేసిన వెనుకనే సొమ్ము బట్వాడా కావలెను. సొసైటీ కార్యదర్శికి నెలకింత అనియో వసూళ్ళనుబట్టి నూటికింతయనియో జీతము ఏర్పాటు చేయవలెను.

ఏసభ్యుడుకానీ పాతబాకీ తీర్చినవెనుక నెల దినములు ముగియువరకు క్రొత్తఅప్పును కోరకూడదు. ఇందువలన అడ్జస్టుమెంటుల దురాచారము తగ్గిపోవును.

ముఖ్యముగా సహకారోద్యమ ప్రచారము గ్రామములందు ఎక్కువగా జరుగవలెనని మాయభిప్రాయము. జనులు తమ హక్కులు తెలిసికొన్న వెనుక పరిపాలనలో లోపములను జరుగనియ్యరు! అనుభవజ్ఞులు ఈవిషయమై యోచించి తమకు తోచిన సలహాలను పంపినయెడల వానిని ప్రచురించి, తగినవానిని సొసైటీ నిబంధనలలో చేర్పింప ప్రయత్నింతుము.

---

## అనంతపురం జిల్లా కో॥ బ్యాంకు.

వెనుక ఈబ్యాంకులో పుట్టిన అనర్థములకెల్ల కారణము కార్యదర్శిగారి కొమారుడే మ్యానేజరుగా నుండుట అని చాల మంది ప్రజలభిప్రాయ పడుచున్నారు. వారి ఊహ నిరాధారమైనది గాదు. కాని మరల అదే పొరపాటే చర్వితచర్వణమగుచున్నది. మ॥రా॥శ్రీ రాయిసాహెబ్ హిందూపురము నారాయణరావుగారు ఇప్పుడును బ్యాంకు ప్రెసిడెంటుగా నున్నారు. వారు పెద్దమనుష్యులు ఉదారహృదయులు. దాక్షిణ్యపరులు అల్పస్వల్పములలో చేయిజేసికొను వారుగారు. తెల్లనివన్నియుపాలును నల్లనివినీరును అని నమ్మువారు కావుననే వారు అధ్యక్షులుగానున్న బ్యాంకులో ఏమి జరుగుచుండినదియు పోలీసువారి కైయుక్తమైన వెనుకనే వారికి తెలియవచ్చినవి. తమ మోటారు ఎక్కడ తిరిగివచ్చినదియు వారికి ఎవరో చెప్పినగాని తెలియలేదు. అది ఉండనిండు.

ఇప్పుడు వారికొమారుడు మ॥రా॥శ్రీ హెచ్. సూర్యనారాయణరావుగారిని బ్యాంకులో గుమాస్తాగా నియమించినారు. గుమాస్తాలను నియమించునది, దండించునది, తీసివేయునది అధ్యక్షుని అధికారములో నున్నది. ఇది బ్యాంకు కార్యనిర్వాహకవర్గమునకుగాని డైరెక్టరులకుగాని చెందిన అధికారముగాదు. కావున సూర్యనారాయణరావుగారికి బ్యాంకులో ఉద్యోగమిచ్చినది అధ్యక్షులుగారే, లేదా ఇందులో వైస్ ప్రెసిడెంటుగారికేమైన జోక్యమున్నదేమో తెలియదు. ఏమైనగానీ ఈబాధ్యత అధ్యక్షులకే చెందినది. అధ్యక్షుని కొమారునితో పనిగొనట బ్యాంకు కార్యదర్శికి ఎంతకష్టముగా నుండనో ఇంచుక ప్రపంచానుభవముగలవారికి తెలియకపోదు. మ॥రా॥శ్రీ సూర్యనారాయణరావుగారు బి. ఏ. కొంతకాలము లా చదివి మానివేసిరి. సహకారశాఖోద్యోగమునకు కావలసిన కొన్ని పరీక్షలను ప్యాసుచేసినారు. వారు ఉద్యోగమునకు తగినవారుకారని ఎవ్వరుననలేదు. కాని వారు గుమాస్తాగను తండ్రి అధ్యక్షుడుగను ఉండుటవలన వెనుకటి ప్రమాదములకు కారణమగునేమోయని చాలమంది అనుమానించుచున్నారు. ఈఅనుమానము సూర్యనారాయణరావుగారి ఉద్యోగాభివృద్ధికి ఆటంకముగా నుండక తప్పదు. న్యాయముగా వారికి కలుగవలసిన ప్రమోషనునకూడ ప్రజలు నిందింతురు. ఎంతనిష్పక్షపాతముగానున్నను అధ్యక్షుడు కుమారునికి ప్రమోషన్ ఇచ్చెనని నిందపడక తప్పదు. ఈ నిందకు జంకి ఆయన తన కుమారునికి ప్రమోషన్ ఇయ్యకపోయినయెడల సూర్యనారాయణరావు అభివృద్ధికి భంగముకలుగును. ఎట్లు చూచినను ప్రకృతస్థితి నింద్యముగా నున్నది. కుమారుని అభివృద్ధి కోరునెడల, నారాయణరావుగారు తమ అధ్యక్షస్థానమునకు వెంటనే రాజీనామా నియ్యవలెను. బ్యాంకు అభివృద్ధిని కోరునెడలవారు వెంటనే కుమారుని ఆ ఉద్యోగమునుండి తప్పింపవలెను. ఈ రెంటిలో ఏదోఒకటి చేయకతప్పదు. కొడుకును బ్యాంకు కార్యదర్శిగా చేయుటకు అధ్యక్షులాలోచించుచున్నట్లు అప్పుడే గుసగుసలు బయలుదేరినవి. అట్లు చేసిన యెడల వారు తమ అధికారము దుర్వినియోగము చేసినట్లేయగునని పలువురాడుకొనుచున్నారు. అధ్యక్షునియెడ మాకు మిక్కిలి గౌరవముగలదు. సూర్యనారాయణరావుగూడ మా మిత్రులు. ఇంత నిర్దాక్షిణ్యముగా వ్రాయుటకు మాకును మనసొప్పదు. కాని ఏవిధముగనైనను బ్యాంకు నిందపడుట ఒప్పనిపని దాని వ్యవహారములు చెడినయెడల స్వయంపరిపాలనలో మన అయోగ్యతను సూచించుటకు వేఱుగ సాక్ష్యమక్కర లేదు.

## మౌలానా మహమ్మదాలి.

మహమ్మదాలీ లండనులో అకస్మికముగా గత వారమున చనిపోయెను. అలీ సోదరుల నెరుగని భారతీయుడు లేడు. వారు తమ జీవితమును దేశమాత కర్పణము చేసిరి. అన్నదమ్ము లిరువురును మేరుమందరములవంటివారు. విద్యాధికులు. అందునను, మహమ్మదాలీ ఆంగ్లపాండిత్యమును వాగ్ధోరణియు అసమానమైనవి. ఇంత యోగ్యత కలిగియు వారు ఉద్యోగాధికారముల పొందలేక దారిద్ర్యమునే వరించి దేశస్వాతంత్ర్యమునకే పోరాడుచుండిరి. యుద్ధసమయమున టర్కీని గురించి వ్రాసిన వ్యాసమునకై వారు నాలుగేండ్లు శిక్ష యనుభవింపవలసి వచ్చెను. వెలుపలికి వచ్చినవెంటనే మహాత్మునికి శిష్యులై సహాయనిరాకరణోద్యమములోను ఖిలాఫత్ ఉద్యమములోను శక్తివంచన లేక పనిచేసిరి. వా రాంధ్రదేశమునకు మహాత్ముని వెన్నంటి వచ్చినప్పుడు గవర్నమెంటువారు అరెస్టుచేసిరి. కరాచీలో జరిగిన ఆవిచారణలో ఆలీసోదరుల స్టేటుమెంటు అసమానమైనది. వారికి రెండేండ్లు శిక్ష విధింపబడెను. విడుదలయైనవెనుక మహమ్మదాలీ కాకినాడ కాంగ్రెసునకు అధ్యక్షుడుగా ఎన్నుకోబడెను. వీరరసమును జిమ్మెడి నాటి వారి యా యుపన్యాసము పారాయణము చేయదగినది.

మహాత్ముని విడుదలయైనవెనుక మహమ్మదాలీకిని అతనికిని అభిప్రాయ భేదములు కలిగినవి. కాని స్వాతంత్ర్యోద్యమములో మాత్రము ఒక్కఅడుగు వెనుక వేసినవాడు కాడు. సాంసారిక దుఃఖములు, దారిద్ర్యము రోగములతో కొన్నాళ్ళు కృశించినాడు. ప్రభుత్వాధికారులతో విద్వేషము మానుకొని అనుసరణవల్ల దేశమున కేమైన లాభము కలుగునేమోయని పరీక్షించినాడు. రౌండు టేబిల్ సభలో తగిన ప్రయత్నముచేసి నిర్దాక్షిణ్యముగా బ్రిటీషువారియెదుట భారతీయుల దుఃఖస్థితిని వెల్లడించి స్వాతంత్ర్యసిద్ధి నొందవలెనను పేరాశతో లండనునకు వెళ్ళెను ప్రాణముకంటె దేశభక్తి స్వాతంత్ర్యాభిలాష ఎక్కువ కానిదే. అంతటి అస్వస్థతతో సీమప్రయాణమునకు పూనుకొనియుండడు. రౌండుటేబిల్ సభలో మహమ్మదాలీ పలుకులు సింహఘర్జనముకే. "నేను ఆ బానిసదేశమునకు తిరిగిపోను. నాదేశమునకు స్వాతంత్ర్యమైన నిండు. లేదా నాకిచ్చుటనే గోరీకట్టుడు" అని మహమ్మదాలీ నుడివెను. అతని వాక్యమే ఫలించెను. రౌండు టేబిల్ సభలో స్వాతంత్ర్యము ఆకాశకుసుమమైనది మహమ్మదాలి తనమాట చెల్లించుకొనెను. అతని మృతికి దుఃఖింపని భారతీయుడుండడు. కాని అందరు నట్టిచావు తెచ్చుకొన వయత్నింపవలెను. ఆయన వీరస్వర్గమును సంపాదించెను. ఒక్కగడియ విడుపు విరామము లేక స్వాతంత్ర్యసమరమును సాగించినాడు. తన జీవితకుసుమమును భారతమాత పదముగడి ధన్యుడయ్యెను.

---

## రక్తయాగము.

### ములకనూరు తాళ్ళ తిమ్మారెడ్డి ఛార్జీ

1. 14—7—30 తేదీ కల్యాణదుర్గం పొందటి కల్లంగళ్ళ ఏలము నాడు నీవు కాంగ్రెస్ వారితో చేరి 'గాంధీకి జై' యని అరచితివి.

2. నాస్నేహితులు అంగళ్ళు చేయకుండ ప్రోత్సాహపరచునని వారికి మాటయిచ్చినావు.

3. 1—8—30 నాడు వారు నిషేధమునుగూర్చి కల్యాణదుర్గంలో ఉపన్యసించుచుండగా వారిలో నుంటివి.

### విచారణ.

తిమ్మారెడ్డి తాను నిరపరాధినని. సాక్షుల విచారణ జరిగినది. పోలీసు ఇన్‌స్పెక్టరు, తాను తిమ్మారెడ్డి కాంగ్రెసువారి అరుగుమీద కూర్చొని యుండి ఒకరి ఉపన్యాసము ముగిసినవెనుక గాంధీకిజై అని అరచినది విన్నట్లుచెప్పెను. పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టరు తిమ్మారెడ్డి తన మిత్రులు సవాలు చేయకుండ ప్రోత్సహింతునని మాటచెప్పినదివింటినని రికార్డు చూచిచెప్పెను

ఎక్సైజు సబ్ ఇన్‌స్పెక్టరు పైరెండు విషయములు నిజమని చెప్పెను. పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టరు, 14—8—30 నాడు సాయంత్రి తిమ్మారెడ్డి తినముకనబడి కాంగ్రెస్ వారివెంట పోకపోవుటతప్ప తానింకేమియు చేయలేదని చెప్పినట్లు సాక్ష్యమిచ్చెను.

### డిఫెన్సు.

తిమ్మారెడ్డి డిఫెన్సులో బెస్తవపల్లె రవణప్పశెట్టి ఈడిగ నాగప్ప, తిప్పేసామి, గాండ్లశెట్టి సుబ్బరాయుడు ఘంటాదోణప్ప, బోలప్ప అను వారిని విచారించెను. బోలప్ప, రెడ్డి అల్లుడు. కల్లంగడి చేయమని తనకు డబ్బును తిమ్మారెడ్డి యిచ్చినట్లుచెప్పెను. అంగడినడపుటకు ఈడిగవాండ్లను ఏర్పాటుచేసియిచ్చెనని తిప్పేసామి చెప్పెను. తిమ్మారెడ్డి సబ్ ఇన్‌స్పెక్టరుకు అప్పుయిమ్మని తనకు సిఫారసు చేయుటకువచ్చి యుండెనని ఘంటా దోణప్పచెప్పెను. తక్కిన సాక్షులు రెడ్డి "గాంధీకిజై" అరవలేదనియు కాంగ్రెస్ ప్రచారకుల వెంటనుండ లేదనియు చెప్పిరి.

### తీర్పు.

సబ్ ఇన్‌స్పెక్టరుగారు అప్పుకెచ్చి యుండనందున కేసు కల్పించెనని తిమ్మారెడ్డి వాదము. కాని సబ్ ఇన్‌స్పెక్టరు కోర్టులోనికి వేరనవాడు. పోలీసు ఇన్‌స్పెక్టరు, ఎక్సైజు సబ్ ఇన్‌స్పెక్టరు సాక్ష్యములను నమ్మకుండుటకు వీలుకాదు. రెడ్డి అల్లుడు రెండు అంగళ్ళు చేసెను. రెడ్డి ఇలాఖా గ్రామములలో అంగళ్ళన్నియు ప్రథమ తాలూకులోనే సవాలైనవి. అందువలన తాను నిరపరాధియని రెడ్డి వాదము. కాని పైసాక్ష్యములు చేసిన నేరారోపణకిది సమర్థనము కాదు.

అవన్నియుబట్టిచూడగా, కాంగ్రెసు గుంపులో నున్నప్పుడు తాను వారితో కలసినట్లు నటించి ఇతరచోట్ల తనకనుకూలమైనరీతి వర్తించినట్లు నమ్మవలసి యున్నది

ఈవిషయమునే రెడ్డి పోలీసు ఇన్‌స్పెక్టరుగారికి మనవి చేసుకొనెను. కాంగ్రెసువారిచే వారిపనులకు అతడు ఉపయోగించుకోబడెననుట వాస్తవము. గ్రామరెడ్డిగా నుండవలసిన తెరగున వర్తింపలేదు. కావున అతనిని పనినుండి బరతర్ఫ చేయుచున్నాను.

ఇది అనంతపురం డిస్ట్రిక్టు కలెక్టరుగారగు సయ్యద్ మహమ్మద్ ఇస్మాయిల్ బహాదూర్ గారి తీర్పు. పై చర్యలు ఏచట్టముక్రింద నేరములో ఇందు నిరూపింపలేదు. ప్రాసిక్యూషను సాక్షులందరు సర్కారునౌకరులు. డిఫెన్సు సాక్షులు మోటుబరి ఆసాములు. వీరి సాక్ష్యము అపద్ధమనుటకు దొరవారు కారణములు చూపలేదు. కాంగ్రెసువారెవ్వరో బోధపడదు. ఈ జిల్లాలో కాంగ్రెస్ సంస్థయేలేదు. ఆయన కాంగ్రెస్‌లో చేరినట్లు నటించెనని తీర్పులో వ్రాసెను. నిజముగా చేరలేదనియా ఈశిక్ష? ఈతీర్పు అమూల్యమైనది. చదివినవెనుక "ఇస్మాయిల్ సాహెబ్ బహాదూర్ కి జై" అని కేకవేతమనిపించును.

---

### బుడిమేపల్లి హొన్నూరు రెడ్డి పై ఛార్జీ.

1 కాంగ్రెసువాళ్ళతో కల్లంగళ్ళు సవాలు చేయమని ప్రమాణముచేసిన రైతులకుతోడ్పడి బుడిమేపల్లి అంగడి మొదటి యేలంకాకుండా చేయుట.

2 ఈకట్టుకు లోబడకుండా సవాలుచేసిన కంబం మల్లప్పకు చెలుపుచేయ ప్రయత్నించుట.

అంగడిలో కల్లు అమ్మకాలు కాకుండ చేయుట.

3 కల్లంగడి ఘట్టను కొట్టను శిథిలము చేయుట.

4 అంగడిలో అమ్మకం కాకుండ చేస్తానని బెదరించుట.

5 మాదిగ వాండ్లను అంగడికి పోనీకుండ భయపెట్టుట.

6 కంబగోడు రైతులను కల్లుదాగుటకు వచ్చియుండగ కొట్టించుట.

7 కల్లుతాగనువచ్చిన రాయదుర్గం మహమ్మదీయుని కొట్టించుట.

8 వడ్ల లింగప్పను కల్లు త్రాగివుండేకొట్టి ఊరువెళ్ళగొట్టుట.

9 అంగడి చెక్కబంది లిస్టును సంతకము చేయక పోవుట.

10 రెండవ ఏలమునాడు హాజరు కాకపోవుట

ఈ కేసు ఇంకా తీర్మానము కాలేదు.

# లేపాక్షియూనియన్‌లోని కొన్ని కోఆపరేటివ్ సంఘములు.

డిశెంబరు నెలవులలో జిల్లా కో ఆపరేటివ్ బ్యాంకు వైస్ ప్రెసిడెంటు గారును, ఎగ్రికల్చరల్ ఆఫీసరు గారును, ప్రోపగాండా ఇన్‌స్పెక్టరును సదరీయూనియన్ ప్రెసిడెంటుగారును నేనును కలిసి కొన్ని సంఘములు పరీక్షించు నిమిత్తము వెళ్లితిమి ఒక్కొక్క సంఘములోని వృత్తాంతములను సంగ్రహముగా పాఠకుల కెఱిగింతును.

## లేపాక్షి సొసయిటీ.

దీనికి లేపాక్షి యూనియన్ కార్యదర్శిగా నుండిన మ॥ రా॥ శ్రీ రామచంద్రప్పగారే సెక్రటరి. వారు ఈ సొసైటీ పుట్టినదాదిగా కార్యదర్శిగా నున్నారు. బ్యాంకులో డైరెక్టరుగా గూడ నున్నారు, కావున వారికి కో ఆపరేటివు ఉద్యమవృత్తాంతము చక్కగా తెలుసును. మంచి అనుభవము గలవారు. అయినను లేపాక్షి సంఘములో ఈ లోపములు కనుబడుచున్నవి.

1 పంచాయితీదార్లును కార్యదర్శికి బంధువులునే సొసైటీలో ఎక్కువభాగమును అప్పుతీసికొన్నారు.

2 వారిఅప్పులకు పెట్టినఆయకము ఇచ్చిన జామీనుచాలదు. పంచాయతీదార్లకు జనరల్ బాడీ మంజూరులేనిదే అప్పులియ్యబడినవి.

3 చాల ఋణములకు వాయిదా వృద్ధిచేయబడినది. క్రొత్తగా అప్పులిచ్చినట్లును పాతఅప్పు తీర్చినట్లును పుస్తకములో అడ్జెస్టు మెంట్లు ఎక్కువగా నున్నవి.

4 ఇందువలన అప్పురానురాను పెరిగిపోయి, ఆస్తివిలువ తగ్గిపోయి బాకీలు అడవబడి సొసైటీకి నష్టము కలుగుచున్నది.

5 కొన్నిడిక్రీలు అమలుజరుపకుండ పంచాయితీదార్లు ఆలస్యముచేసినారు. కొన్ని జామీనుపత్రములకు వాయిదాపోయినది.

6 కొన్నితీరిన పత్రములమీదనే మరల ఋణమియ్యబడినది.

7 బైలాకు విరుద్ధముగా ఒక్క అవిభక్తకుటుంబములోనే పలువురకు 2000వరకుఅప్పులీయబడినవి.

8 ఒక్కకేసులో సొసైటీవారు ఆస్తిని తామే కొన్నారు. అప్పు 1034 ఉండగా కొన్నఆస్తి రు 400 కూడ చేయదు.

9 సొసైటీ గుమాస్తాపేరిట 1800 అప్పుయియ్యబడినది. దీని కుంచబడినఆస్తి చాలదు.

ఎంత ప్రయత్నించిన ఈ సొసైటీ జనరల్ బాడీ సభ కలుప సాధ్యము కాలేదు. కావున, ఇతర విశేషములు కనుగొన వీలైనదిగాదు.

## కల్లూరు సొసయిటి.

సొసైటీకి రావలసిన బాకీలు రూ 16,500 అపైకి 11,000 రూపాయలకు అమలు జరుపవలసిన డిక్రీలున్నవి. ఈ మొత్తములో రూ 5,000 బాకీలు నమ్మకముగా వచ్చునని చెప్పవీలు కానివి. కాని సెంట్రల్ బ్యాంకు అప్పునకు భయము లేదు. ఏమందురా సొసైటీ బ్యాంకునకు ఈవలసినది రూ 11 675 మాత్రమే. సొసైటీ రిజర్వుఫండు షేరు మొత్తము రూ 3 000 వరకు నున్నది. కావున ఎన్నడైన బ్యాంకు బాకీకి భయము లేదు.

కాని ఈసొసైటీ వెనకటిపంచాయతీదార్లు దీనిపాడుచేసిరి ఈఊరిలో బ్రాహ్మణ కుటుంబములు జాస్తి వారే ఎక్కువ మొత్తములు అప్పుతీసికొన్నారు. ఒకటి రెండు ఋణముల చరిత్ర సంగ్రహముగా దెల్పెదను.

1 నాను దేవరావుగారు చాలకాలము సొసైటీ మేనేజిమెంటులో నుండిరి. వారుతమ పేరటనుతమకొడుకు వెంటరావు పేరటను 7పత్రములమీద 1800 మొత్తము ఋణముతీసికొనిరి. ఇంక రెండు బినామీ పత్రముల మీద రూ 250 తీసికొనిరి కాని ఆయకపు ఆస్తిమొత్తము రూ 1600 కంటె హెచ్చుచేయదు. జామీనుదార్లలో ఒక్కరు చనిపోయినారు. రెండవవారు ఆయన కొడుకే.

2 సి. యస్. రామరావు అనువారు ఇటీవల వరకు సొసైటీ అధ్యక్షులుగా నుండిరి. వీరి పేరటను 6 పత్రములమీద రూ 1550 అప్పున్నది. ఇందులో సొసైటీ వేయి రూపాయల వఱకు పోగొట్టుకోవలసినట్లు కనుబడుచున్నది. మొదటి రెండు మూడు పత్రములు చేర్చి మరల ఒక్కటిగా అదే భూముల ఆయకము మీద పత్రము వ్రాయబడినది. కాని ఈమధ్యభూములు ఇంకొకరికి ఆయకము ఉంచబడినవి. మొదటి పత్రములే యున్నయెడల సొసైటీ ప్రథమ ఆయకముదారుగా ఉండుచుండెను. అదే మొత్తములను తిరుగ క్రొత్తగా వ్రాయించుకొన్నందున ఈమధ్య ఆయుకం ఉంచుకొన్న షాహుకారు మొదటి ఆయకముదారుడై సొసైటీకి ప్రథమహక్కు తొలగిపోయెను. కాని ఈ విషయమై చట్టములు శోధించి రెండవసారి వ్రాయించుకొన్నవి మొదటి బాకీలే గావున ప్రథమ ఆయకం ఎందుకు చెల్లదో పరీక్షించవలెను.

కొన్ని ఋణములు పైరు ఆయకంమీద ఇయ్యబడినవి. కాని పంచాయతీదార్లు పైరుపండిన వెంటనే తగాదాచేసి సొమ్ము వసూలుచేయనందున బాకీదారులు పంటను అమ్ముకొని తిని సొసైటీ బాకీ నిలవబెట్టినారు. ఈవిధముగా 11 అసామీల నుండి రు. 4,336-0-0 వరకు అడవబాకీలు పడినవి.

బాకీలు తీర్చనందున వడ్డీ పెరుగుచు వచ్చెను. భూముల ధరలు తగ్గెను, వాయిదాలిచ్చి మరల మరల అప్పులు వ్రాయించుకొన్నప్పుడు పంచాయతీదార్లు క్రొత్త జామీనో ఆయకమో ఉంచమని కోరకుండ వల్లనే యుండినది. వారిచేతకు ఈనష్టమునకు కారణము.

పంచాయతీదార్లు మా యెదుట సమావేశమై వెంటనే డిక్రీలు అన్నిటిని అమలు జరుప తీర్మానించినారు.

## శిరివరము.

సొసైటీ కంటె ఈ గ్రామజనులు హిందూపురము వర్తకులకు ఎక్కువ బాకీపడినారు. ఆవర్తకులు మీరు వెనుక తగాదా బెట్టుచుండగా వాయిదాలిమ్మని కోరినారు. వారు నిరాకరించినయెడల బాకీలు చెల్లించకుండునట్లు జనులు మాట్లాడుకొన్నారని తెలియు చున్నది. ఈ అవకాశమును గొని రైతులు కో ఆపరేటివు కంతులు పూర్తిగా చెల్లింప నొప్పుకొన్నారు.

## కొ టి పి.

ఈ సొసైటీలో క. శ్రీనివాసరావు అనువారికు. 338 అప్పు తప్ప తక్కిన అప్పులు భద్రమైన జామీనుతోనున్నవి వాయిదా మీరిన బాకీ విశేషముగా లేదు. సెసైటీ కార్యదర్శి శంకరరావు యువకుడు ఉత్సాహవంతుడు తెలివిగలవాడు. ఈ సారి సెరిప పంట వరకులలో సాధ్యమైనంత వరకు బాకీలు వసూలు చేసెదనని ధైర్యముగా మాటయిచ్చెను. శ్రీనివాసరావు బాకీ విషయమై అతనికి ప్రా ... కే యకతెల్ని సొసయిటీవారు తీర్మానించి అందుకై రూ॥ 130 ఖర్చు పెట్టిరి కాని ప్రాసిక్యూషన్ నిలువలేదు.

## శుద్ధ ఖద్దరు.

అఖిల భారతచరకా సంఘమువారిచే సర్టిఫికెట్ పొందిన శుద్ధఖాది, వివిధరంగులతోను, అనేక రకములలోను దొరకును. కావలసినవారు నెం. 8. కాలేజి హాస్టలుకు వచ్చి చూడనగును. అందరును ఖద్దరునే ధరించి దేశాభివృద్ధికి తోడ్పడుడు.

## NOTICE

1931 సం॥ ఫిబ్రవరి నెల 1 తేది ఆదివారం ఉదయం 8 ఘంటలకు మండల అడవి పంచాయతీదారుల సమ్మేళనము ఫీస్ మెమోరియల్ హాలులో జరుగును,

రావుబహాదూర్ యన్, గోపాలస్వామి అయ్యంగార్, జిల్లా కలెక్టరు, సమ్మేళనమును ప్రారంభింతురు. మ॥ రా॥ శ్రీ గార్లదిన్నె రామేశ్వర రావుగారు సమ్మేళనాధ్యక్షతను దయతో నంగీకరించినారు,

సమ్మేళనములో ఉపన్యసింప గోరువారు ఉపన్యాస విషయమును అధ్యక్షులవారికి యీ నెల 24 వ తేదీలోపల తెలియచేయవలెను, ప్రత్యేకముగ విషయ చర్చచేయగోరువారు యీ నెల 25 వ తేదీన అధ్యక్షులతో అనంతపురమున వారి స్వగృహమున సంప్రదింపవచ్చును,

భోజనాది సౌకర్యములు వచ్చువారే చూచుకొనవలెను, సమ్మేళనమునకు వచ్చువారు ప్రయాణపు ఖర్చులనుగూడ స్వయముగ భరించవలెనే గాని పంచాయితీ పైకమునుండి సెలవుచేయగూడదు.

ఇల్లూరు నరసప్ప.
కలగార్ల సుబ్బారెడ్డి.

## కంచినముద్రము.

కార్యదర్శి కృష్ణరావుగారు అపూర్వ గ్రామమే జస్ట్రీటు, ఇంగ్లీషు చదివిన యువకుడు కోఆపరేటివు ఉద్యమ సూత్రములను చక్కగా ఎఱిగినవాడు, నిరాక్షిణ్యముగా పని చేయు స్వభావము గలవాడు, ఇంతలో కూ 20౦౦ వసూలుచేసి సెంట్రల్ బ్యాంకు నకు పంపెదనని మాట యిచ్చినాడు, ఇక్కడ కూడ కరణం బాకీదారుడు, డిక్రీఅయినను, అది కివిర్యూలో అమలుజరుగ వలెను, ఎవరి మహాత్మ్యమో తాలూకాఫీసులో ఆలస్యమగు చున్నది,

## మానేపల్లి.

ఇందులోనూ పంచాయతీదార్లే ఎక్కువసొమ్ము సంగ్రహించి ఋణపడినారు. డిక్రీలు అమలు జరుపుట ఆలస్యమగు చున్నది, ఈ ఆలస్యమువలన సొసయిటీకి నష్టము కలుగును, బినామీ బాకీలు కొన్ని ఉన్నవి అవి నిండుసభలో బహిరంగము చేయబడెను

కరణం వెంకటరావుకిందటి నెలవరకు సంఘము ప్రెసిడెంటుగా నుండెను, ఆయనతండ్రి వెంకటాచలమప్ప ఎవరిభూములో ఆయకముంచి సొసైటీలో అప్పుతీసికొన్నాడు కొడుకైన వెంకటరావు కరణముగాను సొసైటీ ప్రెసిడెంటుగాను ఉన్నందున ఈ మోసము అతనికి తెలిసియుండకపోదు, వెంకటాచలమప్ప చనిపోయినాడు. బాకీ 1250 వరకు పెరిగినది వెంకటాచలమప్పకు 7 మంది కొడుకులు అందరిమీద డిక్రీఅయినది. ఇద్దరుతప్ప తక్కినవారు ఇతర మండలములలో ఉద్యోగము లందున్నారు. ఊరిలోనున్న ఇద్దరివలన బాకీవెళ్ళదు.

ఇంకొకటి కార్యదర్శిగా నుండిన వెంకటరామప్ప అప్పు. దానిని ఆయనతమ్ముడగు యస్ యస్ మూర్తిగారు చెల్లించుట కొప్పుకొన్నారు.

పెద్ద ఆసాములు పెద్ద మొత్తములు బాకీఉండగా మాకావచ్చినది తగాదా అని చిన్న బాకీదారులు అనెదరుట, ఈసారి ఇంచుమించుగా మానేపల్లి వారిదా మీరినబాకీలన్నియు వసూలు కావచ్చును.

## చోళ సముద్రము.

సొసైటీ వ్యవహారములలో ఎంతగోల ఉండవలెనో అంతఉండినది ఈ సొసైటీలో. కాని ఇప్పుడు క్రొత్త పంచాయతీఏర్పడి చక్కగా పనిచేయుచున్నారు. పూచీలేని పరిమితియొక్క బాధ్యతను శ్రీ వార్తకవి రామచంద్రరావుగారు జనులకు మనసుకు నచ్చునట్లు చెప్పియున్నారు. కాబట్టిసభ్యులే ఒకరినొకరు అదలించి వసూళ్ళు చేయుచున్నారు, ఇందులో ఒక పెద్దరైతుదు 2100 వరకు ఇయ్యవలసియున్నది, ఆ మొత్తమును అతనిబంధువు ఒప్పుకొని తీర్చుటకు సమ్మతించినాడు, ప్రజలలో కదలిక మెలకువ గలిగియున్నది, కావున చోళసముద్రం సొసైటీ నిద్రనుండిలేచి చురుకుగా పని చేయగలదు,

పు॥ రా॥

## ప్రవాహ బంధనము.

[4 వ పేజీ తరువాయి]

క్రిందనే పరిగి ప్రఖ్యాతి పడసినది ఈజిల్లా పెద్ద చెఱువులలో పరిగి చెఱువొకటి. దానిక్రింద 240[0] ఎకరముల తరీ ఆయకట్టు వున్నది. జయమంగళీనది ఆచెఱువున కాధారము. కాని 20 యేండ్లుగా పరిగి చెఱువు, ఏలో ఒకటి రెండు సంవత్సరములలో తప్ప, నిండలేదు. దాక్రింది గ్రామములు దీనావస్థితిలో నున్నవి. దీనికి కారణమేమని అధికారులు విచారింపరు. ప్రజలు విద్యచాలనివారు గాక మరేకర్మమనియెంచి యూరకుందురు. కాని యిటీవల ఆగ్రామ పెద్దలు కారణముల పరిశీలించి కనుగొన్నారు మైసూరు రాష్ట్రములోని 7 గ్రామములవారు జయమంగళీనుండి కాలువలుగుండా నీళ్ళను తమ చెరువులకు త్రిప్పుకొను చున్నారు. కొన్ని గ్రామములవారు తమ చెరువు మరవను ఎత్తుచేసినారు. ఈవిషయములను పరిగి రైతులు అధికారులకు దెల్పిరి. వారును తనిఖీచేసి మైసూరు గ్రామాల రయితులు గావించిన యక్రమములను దర్బారువారికి తెలిపినారు. గాని సంస్థానమువారిది వరకెట్టిచర్యను గైకొనలేదు, పైన జెప్పిన 7 గ్రామములవారు తమ పనులను నిర్విఘ్నముగ సాగించుచునే యుండుటవల్ల మైసూరు గవర్నమెంటువారేమి చర్యను గైకొనలేదనియే యూహింపవలసియున్నది. పై గ్రామాల యక్రమప్రవర్తనమును పరిగి రైతులు ఫోటోలు తీయించి ప్రభుత్వమువారికి బంపుకొన్నారు. మా జిల్లా కలెక్టరుగారును ఈవిషయమున చాల శ్రద్ధవహించి దలతో పనిచేయుచున్నారు, గాని యీసమస్య రాష్ట్రీయము. జిల్లాఅధికారులు నేరుగా ఉత్తర ప్రత్యుత్తరములు జరుపవీలులేదు.

ఎన్నికల సమయమందును కర్నూలు సన్మానపు విందుల సమయమునను మాజిల్లా శాసనసభ్యులు మందల జలవసతి సౌకర్యముల సేకరించువిషయమై చాలవాగ్దానముల గావించినారు. ఆ వాగ్దానముల చెల్లించు భారమిపుడు తటస్థించినది. కొత్త ప్రాజెక్టుల గల్పించుట యట్లుండ ఉన్న జలాధారములను కాపాడవలసినదికూడ యొక బాధ్యత. కాబట్టి యీవిషయమున శాసనసభ్యులు ప్రభుత్వమువారికి యొత్తిడికెట్టి సాధ్యమయినచోట్ల మైసూరు గ్రామాలవారు కల్పించినప్రతిబంధకముల నన్నింటినితొలగింప ప్రయత్నింప ప్రార్థన. ఈవిషయములో నేవోకొన్ని ప్రశ్నలడిగి యూరకున్నంత ఫలములేదు. మదరాసు మైసూరు గవర్నమెంటువారు 1892 లో గావించిన కరారుప్రకారం మైసూరు గవర్నమెంటువారు నడచునంతవరకు ఈవిషయమై ప్రభుత్వమువారిని పదేపదే ప్రశ్నించుచు నుండవలెను.

## పరిగి కోఆపరేటివ్ యూనియన్

16—12—30 తేదీ జరిగిన గవర్నింగుబాడీ మీటింగు.

యిటీవల పత్రికలలో యూనియను, ఫెడరేషను, జిల్లాబ్యాంకు, అనువిషయములో చాలా మంది సహకారులు వ్యాసములు వ్రాయుచుండుట, అందువలని చర్చలు గమనించి మన యూనియన్ వారు అవలంబింప వలసినపద్ధతి తీర్మానించవలెనని సలహాచేయగా, జిల్లా బ్యాంకువారి తనిఖీ వుండినప్పటికిన్నీ, ఫెడరేషన్ వారి తనిఖీవుండినప్పటికిన్నీ, ఆర్థిక విషయములో కాని పరిపాలనావిషయములోకాని, యూనియన్ల స్వాతంత్ర్యమునకు విరుద్ధముగా వుండు యే పద్ధతినికాని యూనియన్ వారు అంగీకరించరని మా అభిప్రాయము.

కె. క్రిష్ణరావు,
ప్రెసిడెంటు.

## పెన్నారు కుముద్వతీ ప్రాజెక్టు.

ఈ ప్రాజెక్టును గవర్నమెంటువారు పరీక్షించినారు. ఇంజనీయరులు ప్లానులు ఎస్టిమేట్లు తయారుచేసినారు. ఈ జలాధారము లాభకరమని ఇంజనీయరుల లెక్కలవలన తేలినదనియు వినుచున్నాము. కావున ఈ ప్రాజెక్టు విషయమున కూడా మా శాసనసభ్యులు పరిశోధించి ఈ ప్రాజెక్టును ఈతూరి బడ్జెటులో చేర్చులాగు ప్రయత్నించి తమ వాగ్దానములను కార్యరూపమున బెట్ట ప్రయత్నింతురని కోరెదము. ఈ విషయములలో ప్రయత్నింపనిచో వెనుకనిచ్చిన వాగ్దానములన్నియు స్వార్థదృష్టితో నిచ్చినవే యని ప్రజ లనుకొనుటలో దోషముండదు.

## "అద్భుత మహామంత్రి తంత్రజ్ఞుడు"

శ్రీయుత బ్ర॥ శ్రీ॥ చలపతి శాస్త్రిలు వారద గ్గర వరకు తా॥ పాతపాళ్యం నివాసులు ప్రస్తుతమున మన శాస్త్రులువారు గావించుచుండు మానవసేవ యపారమైనది కాన జనులు వారి విషయమై తెలిసికొనుట మంచిది. శ్రీయుత శాస్త్రిగారు మహామంత్రవేత్తలు, భూతచికిత్సయందువీరి కసామాన్య పాండిత్యముకలదని చెప్పుటకు వీరు మహానిష్ఠతో నట్టిభూతగ్రస్తులకు పెక్కండ్రకుచేసిన మహోపకారమే తార్కాణము వీరు బహుదినము లేకాగ్రచిత్తముతో తపమాచరించి భగవత్కటాక్షమును వడసినట్లుకూడ తెలియవచ్చుచున్నది. వీరెట్టి బాధలనైన నివర్తింపగలయంత్ర మంత్రముల నుపయోగింపగలరు.

మఱియు, పసిడికి బరిమళమబ్బినట్లు శ్రీ శాస్త్రిగారు వరకవులనికూడ చెప్పుటకెంతయో యానందమగుచున్నది. వీరాశువుగ హృద్యములగు పద్యములను పాటలను ధారాళముగా రచింపగలరు. వీరురచించిన 'జానకీపతి' 'శివమానసబోధక' శతకములు, మఱి కొన్ని గ్రంథములకూడ యచ్చుపడినవి. భగవంతుడిట్టి మహాశయుని దీర్ఘాయు రారోగ్యాదులచే సదా సంరక్షించుచుండుంగాత!

బెస్తరపల్లి, "గ్రామవాసి"

## టెంపరెన్సుకమిటీ—అనంతపురము.

### జవాబు.

వెంకటాద్రిపల్లె, కోనాపురము, అవులేన్న గ్రామములవారు తమ గ్రామములకు టెంపరెన్సువ్యాను తీసుకొనివచ్చి మ్యాజిక్ లాంటర్న్ చూపించవలెనని అడిగినది నిజమే? అయితే వాండ్లు అడిగినకాలము నిండా వర్షాకాలముగా వుండెను. వంకలు వరదలు ఏర్లు పారుచుండెను. పైగ్రామాలకు రస్తాబాగులేదు. రేగడ భూములు మోటారుచక్రములు తిరుగవు కరుచుకొని పోవును. ఇట్లున్నదని తెలియజేయగా వాండ్లు సరే ఇంక రెండుమాసములు నిదానించిరావలెననిరి. ఈసంగతి రాజశ్రీ సాధనపత్రిక ఎడిటరుగారికి తెలుసును. ఇంతలో పైగ్రామస్థులు నిష్ఠూరముతో మాది తప్పు అనిభావించి పత్రికలలో టెంపరెన్సువ్యాను అనంతపురమునుండి గుత్తికి గుత్తినుండి అనంతపురమునకు వెళ్ళుచుండును అని నిందించి వ్రాసిరి. టెంపరెన్సువ్యాను ఈ జిల్లాలో తొమ్మిది తాలూకాలూ తిరుగుతూ పనిచేస్తూ యున్నది. దీనికి హెడ్‌క్వార్టర్సు అనంతపురము. ఇది నెలకు 20 దినములు బైట దిరుగుచుండును. ఒక్కొక్క నెలకు 30 దినములు పనిచేయుచున్నది. ఈ సంగతి మా॥ రా॥ శ్రీ వైస్‌చేర్మన్‌గారికిన్ని, 9 మంది మెంబర్లకున్ను తెలుసును. మాపైన వృథాగా నిందారోపణచేయడము గ్రామస్థుల ధర్మముగాదు. మేము వుండడము ప్రచారమునకుగానే. ఇదిగాక మా కల్యాణదుర్గము తాలూకాకు ఎల్లమరాజు నారాయణభట్టుగారిని ప్రచారకులుగా నియమించినారు. ఆయన శ్రద్ధగాపనిచేయుచున్నారు. అతనిని మీ గ్రామాలకు పిలుచుకొనిపోయి ప్రచారములు సాగింపవచ్చును. ఇపుడు వ్యాను రావేటునకు రిపేరీలోఉన్నది తయారైన పిమ్మట ఆ గ్రామాలకు వస్తూయున్నది. మీరు మీ గ్రామములయందు నిండాపట్టుదలతో పనిచేస్తూన్న మా సహాయమునకోరడము మాకు నిండా సంతోషకరము. గనుక దయుయుంచి కొద్దిరోజులు నిదానించవలెను, అవశ్యకముగా వస్తూవున్నాము.

బి. రామాంజులుశ్రేష్ఠి,
జిల్లాప్రచారకుడు.

## కల్లంగడి—ఆంజనేయస్వామి.

పోయిన ఆంగళ్ళ పాటలకు ముందుగూడ మడకశిరా తాలూకా హరేసముద్రము కల్లంగడి సవాలుదారుడు గుత్తకట్టక నివిలుజైలున కేగవలసినస్థితి సంభవించినది. కడచిన కల్లుపాటలయందు ఇంకొకడు యీ అంగడికొన్నాడు. కాని త్రాగువారులేక అంగడి బొత్తిగా మూయబడినది. తోడనే సవాలుదారుడు మహాకోపమువచ్చి వూరివారందరిని కారాగారమునకు పంపెదనని బెదరించినాడు. కాని కార్యము లేకపోయినది.

సవాలుదారు అంతటితో నాగక కల్లంగడి పికెటుచేయుచున్నారని సర్కారువారికి మనవిచేసుకొన్నాడు. అప్పటినుండి పోలీసువారి గడిబిడి హెచ్చిందిప్రతిదినము అంగడి కాపలా కాయుటకు మొదలు పెట్టినారు, కాని పికెటింగేమియు జరుగలేదు. పోలీసువారు నిరుత్సాహులై మరలిపెళ్ళినారు. తర్వాత గ్రామాధికారిమీద కేసులు పెట్టుట ఆరంభమైనది. గ్రామాధికారి త్రాగువారికి కులకట్టుచేసినాడనిన్ని యికస్వరైనముచేసిన యెడల రిపోర్టు చేసుకొనలేదనిన్ని చార్జిమోపి సబ్ కలెక్టరుగారివద్ద విచారణ జరిగింది కాని మూడు నెలలు గడిచిపోయినవి అంగడి యెప్పటివలె మూయుబడవలసిన స్థితిసంభవించినది.

ఈ గ్రామమునందు శ్రీ ఆంజనేయస్వామి దేవాలయముగలదు. ఇది గడిచిన సంవత్సరము నుండి చాల ఉన్నతస్థితికి వచ్చినది. ఆ దేవాలయపు ధర్మకర్త ఊరిలో మరికొందరు బ్రాహ్మణులు చేరి, ఆంజనేయస్వామి రథోత్సవమునకు డబ్బులేదనియు ఈసిగవారితో రాజీ చేసికొని జనులు త్రాగవచ్చునని తీర్మానించుకున్నట్లును, అతడు రథోత్సవముఖర్చు భరించునట్లును సంధిసభ జరిపినారు. పై సంధిసభకు మడకశిరా యందలి బ్రాహ్మణపెద్దలుకూడా కొంతమంది వచ్చినారు. తుదకు కల్లంగడివానినివద్ద రథోత్సవమునకగు ఖర్చులు పుచ్చుకొని పల్లెయందలి బీద ఆదియాంధ్రులు కల్లంగడికిపోయి కల్లుత్రాగ వలసినదిగా తీర్మానించినారు.

పాఠక మహాశయులారా! ఆ పరమేశ్వరుని పేరట యెంతటి పాపకార్యములు జరుపబడుచున్నవో గ్రహింపవలసియుండును. జిల్లా యందలి దేవాదాయ ధర్మాదయ సంఘమువారు ఇట్టి పాపకృత్యములు పరమేశ్వరుని పేరిట జరుగకుండులాగున చూడవలసి యున్నది.

హరేసముద్రం నరసింగరావు

## NOTICE.

అనంతపురం జిల్లా జడ్జి గారికోర్టులో,

I. P. 41/30.

Bet:—

అర్జీదారు:—షాహిందూ జీవన్‌రూప్ జీ. ఘన్మ్ర బాంబాయి బైయిష్య పార్టనరు రాజ్‌మల్.

And

రెస్పాండెంట్లు:—
1 శ్రీరామ రామయ్య
2 శ్రీరామ హనుమంతయ్య
3 ,, వెంకటరమణయ్య
4 ,, క్రిష్ణయ్య
5 ,, సుబ్బయ్య
6 ,, నారాయణయ్య

పై నంబరులోని రెస్పాండెంట్లు ఆస్తులకు అనంతపురం అఫిషియల్ రిసీవరు గారిని రిసీవరుగా జిల్లాజడ్జిగారు యేర్పాటు చేసియున్నారు. రెస్పాండెంట్లు బాకీలను వసూలు చేయుచున్నట్లు తెలియవచ్చుచున్నది. గాన యెవరైనను రెస్పాండెంట్లకు బాకీలు చెల్లించిన యెడల రిసీవరు గారిని బాధించదు. మరల రిసీవరు గారికి చెల్లించవలసి యుంటున్నదని యిందుపై తెలుపబడమైనది,

అనంతపురం.

యస్. శ్రీనివాసులు,
అర్జీదారు వకీలు.

## శ్రీ మదహోబలము.

### శ్రీ రామసప్తాహము—అఖిల భారత సాధుసమావేశము

ఈ సన్నిధియందంతరాంతర భేదములులేక మానవలోక మనసమానైశ్వర్య సుక్షేత్రత నందుట ప్రత్యక్షము. నేటి ప్రమోదూత సంవత్సర మాఘ శు 2 లు 1931 జనవరి 26 తేది మొదలు సప్తవారములు అవిచ్ఛిన్నముగా నిరంతరాన్నప్రదానమొనర్చుము. శ్రీరామ సప్తాహ మహోత్సవము నిరాడంబర సాధుమార్గ విశాలోదార లక్ష్మీప్రపుత్రుడనదగు శ్రీయుత అనుమల్ల నేమారెడ్డిగారి అధ్యక్షతచే నిష్కళంకాంతరంగుడగు దాసు శ్రీ పోలంగి లింగమూర్తిగారు జరుప సంకల్పించుట కడుంగడు పరమేశ్వరోద్దేశాను సరణమైయున్నది. ఈ సమావేశమునకు కడపజిల్లాలోని శ్రీ మళయాళస్వామి గడికోటస్వామి నానుదాసుగారును అనంతపురంజిల్లాలోని మానవోడ్డి కాశయ్య శ్రీ కొండిన్యాశ్రమ సుబ్బదాసు మున్నగు సత్యగుణ గరిష్ఠులు తమతమ శిష్యపరంపరతో వేంచేసి పార్శ్వకాశయములు వెదజల్లు సమయమిది. భజన సమాజములెల్లను ఆహ్వానింపబడుచున్నవి. మద్యపాన నివారణ, అహింసా ప్రచారక సమాజములెందున్నను అన్నిమండలములకు సంబంధించిన యీ సమావేశమున ప్రబోధ చేయుటమేలు: కల్లుబంగీ సారాయి, కల్లుమందు సేవించు సాధు వేషధారులును పలలాశ నయనులును లవా సమయమున తమ మతియును తగ్గించుకొనుటతో తగ్గించుకొనుటతో చూప దలంచియేని రాగోరుచున్నారు. జాతి మత విపక్షతలేక అన్నప్రదానమొసంగెదరు గనుక బీదలు రావలసి యున్నది. సాధుమార్గ నిర్ణయ మొనర్చుటయేకాదు భవిష్యత్తునకు సాధుకోటిని నిర్మించు తలంపున పండితులు కవులు సర్వవిబుధాంశజాలు రాప్రార్థితులు.

ఓబుళం నారాయణరెడ్డి.


## ఇంద్రజాలమహేంద్రజాలము

ఈ గ్రంథములో జర్మనీగారడి, హస్తలాఘవము ఆంగ్ల ఇంద్రజాలము, మంత్రశాస్త్రము, భూతవైద్యము, యంత్రములు, చీట్లపేకతమాషాలు, వినోదవిద్యలు, మనుష్యుని మాయముచేయుట, మామిడిచెట్టును పుట్టించుట, జీవముతో సమాధియగుట, శరీరములేని తలచేతమాట్లాడించుట, గాలిలో మనుష్యుని నిలుపుట, మొదలగువిచిత్రములున్నవి. దీంచే మేజిక్ చేయగలరు. వెల రు. 4-0-0

### చమత్కారగణితము

(అపూర్వడు) ఇందులో విచిత్రవినోద మనోగణనములు, సమస్యలు, చిక్కుప్రశ్నలు, యుక్తితమాషాలెక్కలు, గణితావధానము గలవు. దీనిని చదివిన తెలివికలుగును. వెల రు. 1-0-0

పోస్టేజి వేరు.

పి. ఆర్. జనార్ధనంనాయుడు,
ఒంగోలు, (గుంటూరుజిల్లా)

# ప్రాథమికోపాధ్యాయులసభ నంద్యాల.

ఈమహాసభ ఈనెల తే 10-11 దీలలో నంద్యాల పురమున సక్రమముగ జరిగినది. రేంజిలోని ప్రాథమికోపాధ్యాయులే కాక స్కూల్సు మ్యానేజరులును ఇతర విద్యాసంస్థల ఉపాధ్యాయులును సభకు విచ్చేసిరి. సింహళ్ళ నంద్యాలకె.జీల, విద్యాధికారులును, సభానిర్వాహణమున కెంతయు ప్రోత్సాహ మొసగుచు హాజరుండిరి. సభకేతెంచిన విద్యాధికులు సమయోచితములగు నుపన్యాసముల నొసంగి సభ్యుల కెంతయు నుపకరించిరి. ఈమహాసభ ఇంత జయప్రదముగ సాగినందులకు కారణము విద్యాధికారియగు శ్రీ ఛార్లెస్ గారి పరిపూర్ణ కృషియు డి॥బో॥డు తా॥ బోరు ప్రెసిడెంటు శ్రీ రామసుబ్బారెడ్డిగారి యొక్కయు ఇతర విద్యాధికులయొక్కయు లోటులేని తోడ్పాటే అని చెప్పదగియున్నది. సభా సమావేశమున ఏకగ్రీవముగ ప్రాథమికోపాధ్యాయు లామోదించిన తీర్మానములపట్ల తా॥బో॥ ప్రెసిడెంటుగారేమి అధికారవర్గమువారేమి, కనుపఱచిన సానుభూతి పూర్వకమైన యాదర మెంతయు. కాలానుగుణ్యముగ పాలిత పాలకులకు కుదురవలసిన సమరస భావమునకు తార్కాణము.

శ్రీ జి. గురుపాదంగారు బి. ఎ. యల్. టి శ్రీ కే. లక్ష్మీనరసయ్యగారు ఎం. ఎ యల్. టి; శ్రీ జి. రామసుబ్బారెడ్డిగారు ప్రెసిడెంటు నంద్యాల తా॥బో॥ మిస్ బెకహామ్ అమ్మగారు శ్రీ ఎ ఎన్. జగదానందంగారు బి ఎ యల్ టి వీరలు క్రమముగా ఆగ్రాసనము నలంకరించి యుండిరి.

పలువురు పలువిషయములనుగూర్చి యుపన్యసించిరి.

## ఆమోదింపబడిన ముఖ్య తీర్మానములు.

ట్రెయినింగు కానట్టియు, 10 సంవత్సరములకు పైబడిన కాలము ఉపాధ్యాయవృత్తిలో నుండునట్టియు ట్రెయినింగునకు పోజాలనట్టియు, అల్పసంఖ్యాకులగు నుపాధ్యాయులను, జీ. ఓ. నెం 3552 రు. యల్ అండ్ యమ్ తే 5—9—30 దీ రూలు 8 లో నౌకరీ నుండి తొలగింపవలసినదిగా విధింపబడినది. కాని అదే జి ఓ లో రూలు 4 లో ఇతర విధముల పరీక్షానుండు విడల, నియమితమైన యోగ్యతలేనట్టి యుపాధ్యాయులైనను, ఉపాధ్యాయ ప్రణాళికలో (Panel) చేర్చవలసినదిగా విధింపబడినది. కావున పై పేర్కొనబడిన అన్‌ట్రైన్డ్ ఉపాధ్యాయులు. ఈ 4 రూలులో విధింపబడినవారుగ భావింపబడుచు నౌకరీనుండి తొలగింపబడకుండునట్లు శ్రీ గవర్నమెంటువారు, ప్రస్ఫుటమైన సలహాలను డిప్యూటీ ఇన్స్పెక్టర్లకు పాలింతురుగాతమని ప్రార్థించుట యైనది.

శ్రీ డైరెక్టరుగారి రిపోర్టు నెం 150 యఫ్ 129 ప్యారా [8] లో, ప్రస్తుతము ప్రాథమికోపాధ్యాయుల యోగ్యతలు చాల లోపభూయిష్టములనియు, తన్నివారణకై లోకల్ బడీలు ఎయిడెడ్ మ్యానేజిమెంట్లు హైయ్యర్ గ్రేడ్ ట్రైన్డ్ టీచర్లనే నౌకరీకి గొనుటకై ప్రోత్సహింపబడుచున్నారనియు. శ్రీ గవర్నమెంటువారు తమ జీ ఓ నెం 11 (లా) తే 4—1—31 దీ ప్యారా 5 లో ఉత్తరువునిచ్చి దెలిపి పరిపూర్ణముగ సామోదించుట్లున గలదు. దీనిననుసరించియే రాబోలు, జి ఓ 3552 ఎల్ అండ్ యమ్ తే 5—9—30వ దీ గలదు జారీ ఆయినట్టున్నది ఎగ్జిస్టింగ్ లోయర్ ఎలిమెంటరీ గ్రేడ్ టీచర్లు, వందలకొలది జయప్రదముగ తమ వృత్తిని సాగించుచు, నౌకరీలలో నున్నారు. గవర్నమెంటువారు, వీరి తొలగదోయు నిప్పుడే సంకల్పించి, ఆచరణను గడంగుట, ఇట్టి బీద ట్రైన్డ్ టీచరుల జీవనోపాధికిని, వీరి యుత్సాహమునకును, భంగము కలిగించుట యగును, గాన, ఉన్నవారిని తొలగదోయు సూచనల, దయామయులై గవర్నమెంటువారు గావింపకుందురుగాతమని ప్రార్థించుట యైనది.

శీతకాలపు సెలవులు గడచిన అనుభవమును బట్టి, డిపార్టుమెంటువారును, నంద్యాల తాలూకా బోర్డువారును నిర్ణయించిన కాలము, గ్రామములలో పనిపాటలు సాగుకాలములో. వచ్చుచున్నది కాన, ఈ సెలవుదినముల సంఖ్యను నిర్ణయించుభారము డిపార్టుమెంటువారును. తాలూకాబోర్డువారును పెట్టుకొని, సెలవివ్వవలసిన సమయసందర్భముల సౌచిత్యమును నిర్ణయించుకొను భారము, ఆయా గ్రామోపాధ్యాయులకే, ఆయా గ్రామములందు లెక్కదగు కమిటీలందుపట్ల వాటికో విడుతురుగాతమని ప్రార్థించుటయైనది.

ఎయిడెడ్ స్కూల్సుటీచర్ మానేజర్లకూడ గవర్నమెంటు ప్రావిడెంటు ఫండునకు చందాదారులుగ జేరి లాభముపొందవగునని తీర్మానించుటయైనది ఈ నంద్యాల రేంజి ప్రధానోపాధ్యాయుల మహాసభా సమావేశమున లోకస్థాయిసంఘమేర్పరుపవలసినదిగ తీర్మానించుటయైనది.

మహాసభా సభ్యత్వమునకు సంవత్సరమునకు ఒకటికి ఎనిమిది అణాలను సొమ్ము చెల్లించులాగున తీర్మానింపబడినది.

మహాసభా సమావేశమునకు డెలిగేట్ఫీ దినము ఒకటికి ఒక రూపాయిచెప్పున నుండవలెనని తీర్మానించుటయైనది,

దత్తమండలముల ప్రాథమిక పాఠశాలలకుగాను ప్రత్యేకమైన మాసపత్రికను నెలకొల్పి సాగింపవలసినదిగ తీర్మానించుటయైనది పత్రికకు సంవత్సరమునకు చందా రు. 1—8—0 లుండునట్లును పత్రికా నిర్వహణమునకై యుదారాశయులగు స్కూల్సుమ్యానేజర్లు ధనసహాయము జేయ ప్రార్థింపబడవలయుననియు తీర్మానించుటయైనది. పత్రికా నిర్వహణభారము స్థాయి సంఘమువారిదేయని తీర్మానించుటయైనది.

సెక్రెటరీ.

## ప్రాథమిక పాఠశాలోపాధ్యాయ సంఘపు వార్షికోత్సవము.

కలిపి (పెనుగొండ తాలూకా)

పై సంఘము 1930 సంవత్సరం డిశంబరు నెల 19 తేదీన సుమారు 12—30 ఘంటల సమయమున పెనుగొండ తాలూకా కలిపి గ్రామమున మ॥రా॥శ్రీ తాలూకాబోర్డు ప్రెసిడెంటు అగళి నారాయణరావుగారు బి ఎ యల్. యల్. బి. గారి అధిపత్యము క్రింద సమావేశమయ్యెను. పెక్కండ్రు విద్యాధికులు, విద్యాభిమానులు, ఉపాధ్యాయులు పురప్రముఖులు, సభనలంకరించిరి. ఈసభకు 40 మందికి పైబడిన ఉపాధ్యాయులును, దాదాపు 400 మంది ప్రేక్షకులును హాజరుండిరి.

ఈ సంఘపు సెక్రెటరీగారగు కె. టి. కృష్ణమూర్తిరావుగారు "స్త్రీ విద్యను"గురించి ఒక చక్కని వ్యాసమును వ్రాసి చదివిరి.

స్వాగత పద్యములు కలిపి సహోపాధ్యాయులైన యం. దాశప్ప అనువారును చదివిన పిమ్మట అధ్యక్షులు తమ యభిప్రాయములను మేఘగ్ఘోష భాషణములుగా నుపన్యసించిరి. ఉపాధ్యాయవృత్తిని చక్కచేయుటకును. నేతివాల్పములయినను. అధ్యాత్మికముగా బోధకుల గౌరవాస్పదమైనదిగా చేయుటకును అనేక అమూల్యములగు హితోపదేశములను వ్యక్తీకరించిరి.

సుమారు 5 గంటల సమయమున సభనలంకరించిన ఉపాధ్యాయుల ఛాయాపటము తీయబడెను. పిమ్మట కలిపి ప్రాథమిక పాఠశాల విద్యార్థులు యీ గ్రామములో రాత్రి "మహానంద"యను నాటకము శ్లాఘాపాత్రముగ ప్రదర్శించి గానకళాకౌశలముతో సభ్యుల నానందవార్ధిలోలలాడించిరి.

గుమ్మఘట్ట బ్రహ్మశ్రీ సుబ్బాశాస్త్రులవారు ప్రేక్షకులుగా యిచ్చట కరుదెంచి శ్రీమద్రామాయణములోని కొన్ని యంశములను గూర్చి గ్రామజనులకు, ఇతర ప్రేక్షకులకు తేటతెల్లమగునటుల యుపన్యసించినందులకు వినయపూర్వకముగా వారికి వందనము లర్పించుచున్నాము. కె. టి. కృష్ణమూర్తిరావు.

## అమరాపురము.

2—1—31 రాత్రి ఈవూరి బాలికాపాఠశాలయందు శ్రీయుతులు పెద్దాపురపు పార్థసారథి బి. ఎ. గారిచే అష్టావధానము జరుపబడెను. పురవాసులు పెక్కురువిచ్చేసి యుండిరి. వారియందు గారు ఆకస్మిక అంధత్వ మనుభవింపవచ్చినది. వారంధులై నప్పటినుండియు గుడ్డివారి బాగోగులు చక్కగ పరిశీలించి వారికష్టములు బాప పలువిధముల పాటుపడుచున్నారు. వారి సౌజన్య సత్కార్యములు గాపాడుచు వారి నేత్రావరోధము తప్పించునట్లు మనము శ్రీనాథుని వేడుకొందుముగాక.

ఆ. రామదాసశాస్త్రి,
హ. లక్ష్మీనరసింగరావు,
ఉపాధ్యాయులు.


సంపాదకీయ సూచనలు.

అనంతపురం జిల్లా వ్యవసాయకుల పార్టీ.

ఇది ప్రకటన కనుక ప్రకటన చార్జీ ఇచ్చిన యెడల ప్రకటింపబడును.

పాతివ్రత్య ప్రశంస.

ప్రచురింపజాలనందుకు చింతిల్లు చున్నాము.


మా యేజంట్లు:—

బి. వెంకటసుబ్బయ్య శెట్టిగారు

c/o బి. సి. ఆదినారాయణచెట్టిగారు, అనంతపురము.

సి.యస్. శేషగిరిరావుగారు, వర్తకులు. నంద్యాల.

యం. రామరావుగారు. ది జనరల్ స్టోర్సు, కడప.

యస్. గోపాలస్వామినాయడు అండు సన్సు, కర్నూలు.

వి. సి. కాలప్పరావు అండు సన్సు, బళ్ళారి.

కె. ఆర్. భాస్కరయ్యబ్రదర్సు, హిందూపురము.

కేటలాగు ఉచితము

ఆయుర్వేదాశ్రమము,

తపాలుపెట్టె 287, మదరాసు.

సాధన బుక్ డిపో.

అనంతపురము

అశోకుని ధర్మశాసనములు. (బి. ఏ. టెక్స్టు)

సంస్కృత లోకోక్తులు.

సేవాంజలి

మయూరధ్వజచరిత్ర.

ప్రణయసరణి. (ఇంటర్మీడియేట్ కు టెక్స్టు)

వ్యాపారశాస్త్రము. (డిటో)

సహకారపద్ధతి సాధన.

జర్మనీ దేశపు విద్యావిధానము.

వేంకటపతిదేవమహారాజు.

గొప్ప బహుమానము **సర్వము స్వర్ణమయము.** బలే మంచిసమయము

భాను తేజని బంగారుకిరణములు, బంగారు జీవితపు బంగారు దినములు

బంగారు కోరికల బంగారుచర్యలు, బంగారు పైరుల బంగారు విత్తనములు.

బంగారు ఆరోగ్యపు బంగారు భోజనము బంగారు మాత్రల బంగారుబలము.

బంగారు సంవత్సరములు బంగారు 50 తో సమాప్తి

బంగారు ఉత్సాహము బంగారు 60 తో సమాప్తి.

## ఆతంకనిగ్రహ ఫార్మసీ స్వర్ణోత్సవము.

హిందూదేశపు పురాతన ఘనకీర్తివలసిన నిర్మలమైన ఆయుర్వేదశాల

ఏబదిసంవత్సరములు ప్రఖ్యాతిగలిగి యీ ఫార్మసీ స్వర్ణోత్సవ సమయమున కృతజ్ఞతాసూచకముగా

మేము మా వ్యాపారస్తులకును మాయందభిమానముగల వారికిని 60 (అరువది) బంగారుప్రాతిగలిగిన

## శక్తిసంజీవని మాత్రలను

సరసముగా విక్రయింపబోవుచున్నాము.

ఈమాత్రలో చేర్చబడిన ప్రతియొక్క వస్తువు దేహముయొక్క శక్తిని వృద్ధిపరచి రక్తమును శుద్ధిపరచి జ్ఞాపకశక్తిని యభివృద్ధిగావించి శరీరమును మిక్కిలి దృఢముచేయును. ప్రతివస్తువుయొక్క సుగుణమిట్టుండగా మాత్రయుతసికయు గొంతయుపయోగకరమని నిర్ణయింపవచ్చును. దాని యుపయోగములన్నియు వర్ణనాతీతము ప్రతియొక మానవుడు తన జీవితకాలములో సుఖముగా యుప్పుడే యెందుకనగా యీ స్వర్ణోత్సవమున రూ. 4 లు లాభము పొందుచు దీనిచే దానిని యుపయోగించుటకు తప్పక ప్రయత్నింపవలెను.

ప్రతి సీసాయొక్క అసలు వెల రూ. 12 గా యుండినప్పటికిని మేము రూ. 8 లకు విక్రయింప సాహసించితిమి. మిక్కిలి సార్థకమైనట్టియు, సులభముగా లభింపనటువంటి యీ మాత్రలను యసలుఖరీదునకు కూడ సహాయార్థము విక్రయించుచున్నాము.

ఈ సదుపాయము 1931వ సం|| మే నెల ఆఖరువరకే చెల్లును. దానితర్వాత చెల్లదు.

ఆతంక నిగ్రహ ఫార్మసీ,

జామ్‌నగర్—కత్తియవార్.

బ్రాంచి ఆఫీసు—26 బ్రాడ్వే, మద్రాసు.

# The Motor Sales Company,

EXTENSIONS, ANANTAPUR.

*District Dealers for:—*

**GENERAL MOTOR PRODUCTS**

CHEVROLET

**CARS & BUSES**

# CHEVROLET 1930 MODEL

*NEW CAR - NEW BUS - NEW TRUCKS.*

Consumption:-18 miles per Gallon Petrol Ga uranteed

**ON 23-25 SEATER BUS.**

PRICES:—

25 SEATER BUS Rs 3000 12 SEATER BUS 2200

CHASIS $1\frac{1}{2}$ Ton. Rs. 2450. $\frac{3}{4}$ Ton. CHASSIS Rs. 1800.

FETON CAR Rs. 2700

*Immediate delivery.*

P. S. HARI HARAN,

PROPRIETOR,

Location—OPPOSITE TALUK OFFICE


Edited Printed & Published by Pappur Ramacharlu, at Sree Sadhana Press, Anantapur